THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 45 సంచిక : 9 1.8.2025, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## అదును చూసి బాణమేసి...

# పక్కా పద్మవ్యూహం



### వైసీపీకి కూటమి షాక్‌లు
### కేసుల వలయంలో జగన్ & పార్టీ
### కోలుకునే అవకాశం ఇవ్వకుండా బాబు స్కెచ్



ఓ వైపు లిక్కర్ స్కాం.. మరోవైపు వివేకానందరెడ్డి హత్య కేసును సమాంతరంగా కదిలిస్తున్న కూటమి సర్కారు.. వైఎస్సార్‌సీపీని అదునుచూసి కోలుకోలేని దెబ్బ కొట్టాలనే లక్ష్యంతో పావులు కదుపుతోంది. కీలక కేసుల్లో నిందితులను అరెస్టు చేయడమే కాకుండా కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి, కోర్టుల్లో పిటిషన్లు వేయడం ద్వారా ప్రతిపక్ష పార్టీని ఉక్కిరిబిక్కిరి చేయాలని ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలుస్తోంది. రానున్న సంవత్సర కాలంలో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అగ్రనాయకత్వానికి ఊపిరాకుండా చేసి, అదే సమయంలో రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని తలపోస్తోంది. తద్వారా ప్రత్యర్థిని ప్రజాక్షేత్రంలో కోలుకోలేని దెబ్బతీయాలని తహతహలాడు తోంది. ఈ క్రమంలో రాష్ట్రంలో మరోసారి వైఎస్సార్‌సీపీకి అవకాశం ఇవ్వకుండా ఉండేందుకు శతవిధాలా ప్రయత్నం చేస్తోంది. ఇక చంద్రబాబు ఎత్తులకు చిత్తవుతున్న జగన్ & పార్టీ కోలుకునేందుకు ఆపసోపాలు పడుతున్నారు. శ్రేణులు చెయ్యి జారిపోకుండా ఆ పార్టీ జాగ్రత్తలు తీసుకుంటోంది. అయితే కూటమి ప్రభుత్వం మాత్రం అన్ని వైపుల నుంచి ఒత్తిడిని తీవ్రతరం చేస్తూ బెంబేలెత్తిస్తోంది.


### రెడ్‌బుక్‌తో ప్రారంభించి..

కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుండీ గతంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించిన వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారుల భరతం పట్టేందుకు రెడ్ బుక్‌ను ఉపయోగిస్తోంది. జగన్ ప్రభుత్వ పాలనలో తమను ఇబ్బందులకు గురి చేసిన వారిని చెరబడుతూ వారికి చుక్కలు చూపిస్తోంది. ఇప్పటికే శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు పలువురు నాయకులను కటకటాల పాలు జేసింది. వీరిలో కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నందిగం సురేష్, వల్లభనేని వంశీ, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వంటి మాజీఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు ఉన్నారు. ఇక చోటామోటా నాయకులకు లెక్కేలేదు. తాజాగా వైఎస్సార్ సీపీలో నంబర్–2గా భావిస్తున్న సిట్టింగ్ ఎంపీ మిథున్‌రెడ్డి కూడా అరెస్టయ్యి రాజమండ్రి సెంట్రల్‌జైల్‌లో రిమాండ్ ఖైదీగా మారడంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నట్లు తెలుస్తోంది.

2లో

# క్వార్ట్జ కర్మాగార స్థాపన విరమించుకున్న వీపీఆర్

### తప్పుడు విమర్శలు, అర్థరహిత నిందలు, స్వార్థపూరిత రాజకీయాలు, విషపు రాతలు..
### ఫలితంగా.. 400 కోట్ల పెట్టుబడికి, 1000 మంది ఉపాధికి మంగళం.



నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి మనసుకి కష్టం కలిగింది. కొంతమంది స్వార్థ రాజకీయ నేతల విమర్శలు, అపరిపక్వ మీడియా కథనాలు, పత్రికలలో విషపూరిత రాతలు ఆయనకి ఆవేదన కలిగించాయి. ఫలితంగా 400 కోట్ల రూపాయల పెట్టుబడి ఆగిపోయింది. వెయ్యి మంది ఉపాధి అవకాశం అటకెక్కింది. వీపీఆర్ పెట్టదలచిన క్వార్ట్జ కర్మాగార ఆలోచనని విరమించుకుంటున్నట్లు ఆయనే స్వయంగా ప్రకటించారు.

3లో



# నేల నుండి నింగికి.. నిసార్ ఉపగ్రహం

### ▶ జిఎస్ఎల్‌వి-ఎఫ్16 సక్సెస్

అమెరికా అంతరిక్ష సంస్థ నాసాతో కలసి, భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) చేపట్టిన తొలి అంతరిక్ష ప్రయోగం దిగ్విజయమైంది. దాదాపు పదేళ్ళ సుదీర్ఘకాలం ఈ ఉపగ్రహ ప్రయోగానికి అమెరికా–భారత్ చేసిన సంయుక్త కృషి ఎట్టకేలకు ఫలవంతమైంది. జులై 30, బుధవారం సాయంత్రం శ్రీహరికోటలోని షార్‌లో ఉన్న రెండవ ప్రయోగ వేదిక మీద నుంచి జీఎస్ఎల్‌వీ–ఎఫ్16 రాకెట్, 'నిసార్' ఉపగ్రహాన్ని సురక్షితంగా, జయప్రదంగా నిర్దేశిత కక్ష్యలో ప్రవేశించి ఇరుదేశాల శాస్త్రవేత్త లకు ఆనందం కలిగించింది. దీంతో నాసా–ఇస్రో బంధం కూడా మరింత బలోపేతమయినట్లయింది. ఇస్రో చరిత్రలో ఇదో మైలురాయిగా నిలిచింది. రాకెట్ ప్రయోగం విజయవంతం కావడంతో భారతీయులంతా 'జయహో ఇస్రో' అంటూ శాస్త్రవేత్తలందరినీ అభినందించారు.

12లో

# పక్కా పద్మవ్యూహం

(మొదటిపేజీ తరువాయి)

ఈ క్రమంలోనే రెడ్‌బుక్ పేరు చెబితే ఒకడికి గుండె పోటు వస్తుంది, మరొకడు బాత్‌రూంలో జారిపడతా రంటూ లోకేష్ వైఎస్సార్‌సీపీ నాయకులపై సెటైర్లు కూడా వేశారు. ఇక రెడ్‌బుక్ బారినపడిన అధికారుల సంఖ్య లెక్కే లేదనే చెప్పాలి. పదులసంఖ్యలో ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు ఈ జాబితాలో ఉన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ ఇంటలిజెన్స్ చీఫ్, విజయవాడ కమిషనర్లు, డీసీపీలుగా కీలక స్థానాల్లో పనిచేసినవారు కూడా కూటమి ప్రభుత్వ దెబ్బకు పోస్టింగ్‌లు లేక అల్లాడుతున్నారు. ఇటీవల హైకోర్టు ఉత్తర్వుల కారణంగా సోషల్‌మీడియా పోస్టుల కేసుల్లో అరెస్టుల పర్వానికి కొంత అడ్డుకట్ట పడినా, ఇతర కేసుల్లో నిందితుల గుర్తింపు, విచారణ వేగంగా సాగుతోంది.

### లిక్కర్ కేసుతో ఉక్కిరిబిక్కిరి చేసి..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే అతిపెద్దది, అత్యంత ప్రధానమైనదిగా భావిస్తున్న లిక్కర్ కేసులో తవ్వుతున్న కొద్దీ అక్రమాలు పుట్టలకొద్దీ బయట కొస్తున్నాయి. 3,500 కోట్లకు పైగా ఉంటుందని భావిస్తున్న ఈ కుంభకోణంలో ఇప్పటికే పలువురు బేవరేజస్ కార్పొరేషన్ అధికారులు, నాయకులు నిందితులుగా ప్రత్యేక దర్యాప్తు సంస్థ సిట్ గుర్తించింది. మొత్తం 49 మందిపై అభియోగాలు నమోదవగా, డజను మంది రిమాండ్ ఖైదీలుగా ఊచలు లెక్కబెడు తున్నారు. ఇక తొలి చార్జిషీట్‌లో బిగ్‌బాస్ జగన్ సహా చెవిరెడ్డి, మిథున్‌రెడ్డి తదితరుల పేర్లను ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) చేర్చడంతో ఈ కేసు దర్యాప్తుపై జాతీయ స్థాయిలో చర్చ జరుగుతోంది. ఇదే అదునుగా కూటమి పార్టీలకు చెందిన ఎంపీలు పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ఆంధ్రప్రదేశ్ లిక్కర్ స్కాం వివరాలను పూర్తిస్థాయిలో వెల్లడించి.. వైఎస్సార్‌సీపీ నాయకుల ఆమ్యామ్యాల పర్వాన్ని దేశమంతటికీ వినిపించాలని నిర్ణయించారు. ఈమేరకు లోక్‌సభ స్పీకర్ వద్ద టీడీపీ ఎంపీలు ప్రత్యేక సమయం కూడా కోరినట్లు ప్రచారం సాగుతోంది.

### నష్టనివారణ కోసం హస్తినకు జగన్..

ఇదే సమయంలో పూర్తి డిఫెన్స్‌లో పడిపోకుండా నష్ట నివారణ చర్యలు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ అధినేత జగన్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈమేరకే కేంద్రంలోని పలు పార్టీల ప్రతినిధులు, నేతలను కలిసి కూటమి అకృత్యాలను, అక్రమ కేసులతో వేధిస్తున్న వైనాన్ని తెలియజేసేందుకు హస్తినకు వెళ్లనున్నట్లు సమాచారం. ఈ క్రమంలో జగన్ ఢిల్లీ టూర్ ఏర్పాట్లను, కావాల్సిన అపాయింట్‌మెంట్లను సంపాదించే బాధ్యతను ఆ పార్టీ ఎంపీలు, సీనియర్ నాయకులు భుజాలకెత్తున్నట్లు కూడా ప్రచారం సాగుతోంది.

ఒకవేళ ఇదే నిజమైతే జగన్ ఏఏ పార్టీల నాయకులను కలుస్తారనేది ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వంలో ప్రధాన పార్టీ అయిన బీజేపీతో రాష్ట్రంలో తెలుగుదేశం అలయన్స్‌లో ఉండడంతో ఆ పార్టీకి చెందిన కేంద్రమంత్రులు ఎంతవరకు అపాయింట్‌మెంట్ ఇస్తారనేది సందేహమే. అలాగే కేంద్రంలో ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్‌పార్టీతో వైఎస్సార్ కాంగ్రెస్‌కి ఉప్పు-నిప్పు అనేలా పరిస్థితి ఉంది. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్యం ఠాకూర్ ఇటీవల జగన్ హయాంలో చోటు చేసుకున్న లిక్కర్ స్కాంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. 2019-2024 మధ్య అధికారాన్ని అడ్డం పెట్టుకుని నాసిరకం లిక్కర్ ద్వారా జగన్ ప్రభుత్వానికి చెందిన పెద్దలు వందలకోట్లు వెనకేసుకున్నారంటూ ఆయన పెద్దఎత్తున ఆరోపణలు గుప్పించారు. ఈ నేపథ్యంలో ఇండియా కూటమిలోని నాయకుల కటాక్షం జగన్‌కు దక్కడం దుర్లభమే. ఈ పరిస్థితుల్లో జగన్‌మోహన్‌రెడ్డి కలుసుకునే జాతీయ స్థాయి నాయకులు ఎవరన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారనుంది. అదే సమయంలో అఖిలేష్‌యాదవ్, మమతా బెనర్జీ, స్టాలిన్ నేతృత్వం వహిస్తున్న ఎస్పీ, తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే నేతల అపాయింట్‌మెంట్ల కోసం వైఎస్సార్‌సీపీ నాయకులు కాలికి బలపం కట్టుకుని హస్తినలో ప్రదక్షిణలు చేస్తున్నట్లు వార్త.

### తొలుత గవర్నర్‌కు నివేదన..

లిక్కర్ కేసులో సిట్ దూకుడు ప్రదర్శిస్తుండడం, మాజీ ఎక్సైజ్ శాఖ మంత్రి నారాయణస్వామి సాక్షిగా హాజరై అప్రూవర్‌గా మారుతారనే ప్రచారం జోరందుకోవడంతో జగన్ పార్టీలో ఆందోళన తీవ్రమైనట్లు విశ్లేషకులు చెప్తున్నారు. దీంతో ఇటీవల అనారోగ్య సమస్యలకు చికిత్స పొందిన గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిసి పరామర్శించే పేరుతో, రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులను జగన్ వివరించినట్లు సమాచారం. ఇదే సమయంలో భారతీ సిమెంట్స్‌లో సోదాలు చేసి, తమ ఆర్థిక మూలాలను దెబ్బతీసే ప్రయత్నం సిట్ చేస్తోందని ఆరోపించినట్లు తెలిసింది. ఇక తననూ అరెస్టు చేస్తారనే ప్రచారం సాగుతున్న నేపథ్యంలో జిల్లాల పర్యటనల సంఖ్యను పెంచి నాయకులు ఆత్మవిశ్వాసం కోల్పోకుండా చూడాలని జగన్ నిర్ణయించినట్లు ప్రచారం సాగుతోంది. ఇందులో భాగంగానే తాజాగా నెల్లూరులో కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి వంటి నేతల పేరుతో పరామర్శల యాత్ర చేసినట్లు తెలిసింది.

### వివేకానందరెడ్డి హత్య కేసులో.. పురోగతి

ఇక ఆరేళ్లుగా అతీగతిలేని వైఎస్.వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో ఇటీవల కదలిక వచ్చిన విషయం తెలిసిందే. అవినాష్‌రెడ్డి బెయిల్ రద్దు చేయాలంటూ వివేక కుమార్తె సునీత సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయడం, ఈ విషయంలో సీబీఐ తన అభిప్రాయం చెప్పాలంటూ ధర్మాసనం ఆదేశించడంతో కేసు తదుపరి పరిణామాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చి అవినాష్‌రెడ్డి బెయిల్‌ను రద్దు చేసేలా తెలుగుదేశం పార్టీ ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు సమాచారం. ఇదే జరిగితే ఇప్పటికే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న వైఎస్సార్‌సీపీకి అది అశనిపాతంగా పరిణమించే అవకాశం ఉందని విశ్లేష కులు అభిప్రాయపడుతున్నారు.

గత ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి చెల్లెళ్లు షర్మిల, సునీత ఆయనకు వ్యతిరేకంగా విస్తృతస్థాయిలో ప్రచారం చేయడమే కాకుండా.. ఏకంగా అవినాష్‌రెడ్డిపై పోటీ చేసి సవాల్ విసిరారు. ఈ పరిణామాలన్నీ 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గట్టిగానే దెబ్బకొట్టాయి. ఈ పరిస్థితుల్లో మరోసారి వై.ఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు తెరమీదికి వచ్చి రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైతే, అది రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జగన్ పార్టీకి అదృశ్య ప్రత్యర్థిగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇదే సమయంలో క్వార్ట్జ్ గనుల అక్రమాల కేసులో అనిల్‌కుమార్‌యాదవ్, జగన్ పల్నాడు పర్యటనల నిబంధనలను ఉల్లంఘించిన కేసులో అంబటి రాంబాబు, ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అటవీ భూముల ఆక్రమణల కేసులో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రెచ్చగొట్టే వ్యాఖ్యల కేసులో పేర్ని నాని వంటి మాజీ మంత్రులను, ప్రశాంతిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి వంటి మాజీ ఎమ్మెల్యేలను కటకటాల్లోకి పంపి వైఎస్సార్‌సీపీని కోలుకోలేని దెబ్బకొట్టాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది.

ఏదేమైనా ఇప్పటికే లెక్కకు మిక్కిలి కేసులతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న వైఎస్సార్‌సీపీకి, కేంద్రం ద్వారా, న్యాయవ్యవస్థ ద్వారా చంద్రబాబు పన్నుతున్న పక్కా పద్మవ్యూహం ఊపిరాడకుండా చేస్తుందనడంలో సందేహం లేదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. ఇవే పరిస్థితులు మరికొన్నాళ్లు కొనసాగితే స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ గెలుపు నల్లేరుపై నడకే అని జోస్యం చెప్తున్నారు....!

# తప్పు చేసిన నాయకులను సమర్థిస్తారా?



## జగన్‌కు.. ప్రశాంతిరెడ్డి సూటిప్రశ్న

తప్పు చేసిన నాయకులకు మీరు మద్దతిస్తారా?..వారిని సమర్థిస్తారా?. అంటూ కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాజీ ముఖ్యమంత్రి, వైకాపా అధినేత వైఎస్ జగన్‌ను సూటిగా ప్రశ్నించారు. తనను దుర్భాషలాడిన మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డిని జగన్ పరామర్శించడానికి వచ్చిన నేపథ్యంలో, ఆమె నెల్లూరులోని తమ నివాసంలో మాట్లాడుతూ, వైకాపా నాయకులు స్థానికంగా అభివృద్ధికి సైంధవుల్లా అడ్డుపడుతున్నారన్నారు. వైకాపా నాయకుల ప్రవృత్తి ఏందో అందరికీ తెలిసిందేనన్నారు. తప్పు చేసినవారిని కట్టడి చేయాలి కానీ, వారికి మద్దతు ఇవ్వడం ఏమిటన్నారు. తాము ప్రజలకు సేవ చేయడానికి రాజకీయాల్లోకి వచ్చినవాళ్లమని అందరికీ తెలుసని, విపిఆర్ నీతి నిజాయితీలు ప్రజలందరికీ తెలిసినవేనని అన్నారు. విపిఆర్‌పై విమర్శలు చేయడం అర్థరహితమన్నారు. విపిఆర్ నిజాయితీ అందరికంటే జగన్‌కే బాగా తెలుసన్నారు. ప్రజలకి సేవ చేయడానికి వచ్చిన తమపై లేనిపోని నిందలు వేయడం మంచిపద్ధతి కాదన్నారు. జిల్లా ప్రజల కోసం పరిశ్రమలు ఏర్పాటుచేసి వారి సంక్షేమాన్ని చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు వంటి నేతలు కృషిచేస్తుంటే, వైకాపా నాయకులు మాత్రం అభివృద్ధిని సహించలేక పోతున్నారని దుయ్యబట్టారు. ప్రతిమనిషి క్షేమంగా ఉండాలని, వారు ఇతర పార్టీలకి చెందినవారైనా సరే అందరూ బాగుండాలని చంద్రబాబు కోరుకుంటారని, ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా చూడాలని తమ ప్రభుత్వం ప్రజలకు రక్షణగా ఉంటోందే తప్ప, జగన్‌మోహన్‌రెడ్డిని అభిమానులు కలుస్తుంటే..వారిని కలవనీయకుండా చేయాలని కాదని ఆమె స్పష్టం చేశారు. గతంలో ఇలాంటి యాత్రలప్పుడు జరిగిన సంఘటనలను దృష్టిలో పెట్టుకుని, ఇకపై ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పెద్దఎత్తున బందోబస్తు చేస్తుంటే, అలాంటి పోలీసులను కూడా వైకాపా నేతలు ఇష్టప్రకారం మాట్లాడుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల కంటనీరు ఊరకే పోదని, తనకి జరిగిన అన్యాయం ఇక ఏ మహిళకి కూడా జరగకూడదని ఆమె ఆకాంక్షించారు. తమని కన్నీరు పెట్టించిన నాయకుల్ని సమర్థిస్తే, వైకాపా మరో 30 ఏళ్లకి కూడా గట్టెక్కలేదని ఆమె ఆగ్రహంగా అన్నారు.

# జగన్‌వన్నీ పచ్చి అబద్ధాలే!

## ఎమ్మెల్యే సోమిరెడ్డి మండిపాటు



వైకాపా అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.యస్.జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడే మాటలన్నీ పచ్చి అబద్ధాలేనని సర్వేపల్లి ఎమ్మెల్యే, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మండిపడ్డారు. గురువారం నెల్లూరు పర్యటన సందర్భంగా జగన్‌రెడ్డి చేసిన పలు విమర్శలను సోమిరెడ్డి తిప్పికొట్టారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని తన పరిపాలనా దక్షతతో బాగు చేస్తుంటే.. వైకాపా అధినేత జగన్ మాత్రం ఆయనపై లేనిపోని విమర్శలు చేయడం ఘోరమన్నారు. జగన్‌రెడ్డి ధనాశ కారణంగా లిక్కర్ స్కామ్‌లో దాదాపు 40 మంది జైలుకు పోయారని, వారిలో ఐఏఎస్, ఐపిఎస్‌లు కూడా ఉన్నారని అన్నారు. వైకాపా హయాంలో ప్రవేశపెట్టిన చీప్ లిక్కర్ తాగి రాష్ట్రంలో నిరుపేదలైన దాదాపు 30వేలమంది ప్రాణాలు కోల్పోయారని, అంతకంటే దారుణం మరెక్కడుంటుందని ఆయన అన్నారు. ఆ కుటుంబాల పరిస్థితి ఇప్పుడు మరింత దయనీయంగా ఉందని అన్నారు. జిల్లాలో కాకాణి చేసిన అక్రమాలు, పాపాలు అన్నీ ఇన్నీ కావని అంటూ ఆ పాపాల చిట్టా త్వరలోనే బయటపడుతుందన్నారు. ఒక్క రుస్తుం మైన్‌లోనే వేల టన్నుల క్వార్ట్జ్ అక్రమంగా తవ్వకుపోయారని, వాటి విలువ సుమారు 150 కోట్ల వరకు ఉండవచ్చని అన్నారు. గతంలోనే ఈ మైన్సల అక్రమాల గురించి తాము స్వయంగా రంగంలోకి దిగి రెడ్‌హ్యాండెడ్‌గా ఆ ఖనిజాలను పట్టుకున్న విషయం జిల్లా వాసులందరికీ తెలిసిన విషయమేనన్నారు.

# చంద్రబాబుపై విమర్శలు దారుణం



## జగన్‌పై కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ధ్వజం

నెల్లూరు పర్యటన సందర్భంగా వైకాపా అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మాట్లాడుతూ, చంద్రబాబు బావిలో దూకాలని విమర్శించడం దారుణమని నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ధ్వజమెత్తారు. తమ నాయకుడైన ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రప్రజల సంక్షేమం కోసం పనిచేస్తుంటే, వైకాపా హయాంలో వ్యవస్థలన్నిటినీ నిర్వీర్యం చేసిన మీరు చంద్రబాబుపై విమర్శలు చేయడం ఏమిటని ఆయన జగన్ మాటలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు సేవచేయడానికి వచ్చిన విపిఆర్ వంటివారిని విమర్శించడం సమంజసం కాదన్నారు. మహిళా శాసనసభ్యురాలైన వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై ప్రసన్నకుమార్‌రెడ్డి లేనిపోని అనుచిత మాటలు మాట్లాడినా, అలాంటి వారిని సమర్థించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. వైకాపా హయాంలో రాష్ట్రం దివాళా తీసినా, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన చంద్రబాబునాయుడు తన పరిపాలనా దక్షతతో రాష్ట్రాన్ని మళ్ళీ గట్టెక్కించారని, కనీసం రాజధాని కూడా లేని రాష్ట్రానికి అమరావతిని రాజధానిగా చేసి గౌరవం తెస్తున్నారని ఆయన అన్నారు. వైకాపా తీరును చూసి ప్రజలు గుణపాఠం చెప్పారని, ఇక కనుచూపులో కూడా అధికారం రాదని తెలిసినా, ఇంకా వైకాపా నాయకులు రఫారఫా అంటూ మాట్లాడడం విడ్డూరమని ఆయన ఎద్దేవా చేశారు. ఏ చిన్నసంఘటన జరిగినా పోలీసుల వైఫల్యం అని మీరే అంటారని, రక్షణ కలిగించాలని పోలీసులు వస్తే ఆంక్షలు విధిస్తున్నారని అనడం ఇంకా దారుణమన్నారు. చంద్రబాబుపై, విపిఆర్ దంపతులపై, పోలీసులపై జగన్ చేస్తున్నవన్నీ లేనిపోని ఆరోపణలేనని, ఇకనైనా ఆయన ఆ ధోరణి మానుకోవాలని అన్నారు.

# శ్రీ రాజరాజేశ్వరిదేవికి..
# మహా కుంభాభిషేకం

## • పాల్గొన్న వేమిరెడ్డి, ఆల్తూరు దంపతులు



నెల్లూరు నగరంలోని శ్రీ రాజరాజేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారి ఆలయ మహాకుంభాభిషేక మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. శ్రీ కంచికామకోటి పీఠాధిపతులు శ్రీ శంకర విజ యేంద్ర సరస్వతి స్వామీజీ ఆశీస్సులతో, కంచిపీఠం ఆస్థాన సిద్ధాంతి బ్రహ్మశ్రీ ఎల్.విజయసుబ్రహ్మణ్య సిద్ధాంతి నేతృత్వంలో పూజలు, అభిషేకాలు శోభాయమానంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారికి పూజలు చేశారు. ఆలయ శిఖరాన్ని పవిత్ర జలాలతో అభిషేకించారు. ఆలయ జీర్ణోద్ధరణ, విమాన గోపుర పునర్నిర్మాణ దాతలు, అమ్మవారి భక్తులైన నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి



ప్రశాంతి రెడ్డి దంపతులు, ఆల్తూరు సులోచనమ్మ, ఆల్తూరు మహేష్ కుమార్‌రెడ్డి, రాధిక, ఆల్తూరు వారి కుటుంబ సభ్యులు పాల్గొని అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆలయానికి పెద్దఎత్తున వితరణ చేస్తున్న దాతలైన వేమిరెడ్డి, ఆల్తూరు కుటుంబసభ్యులకు ఆలయ అర్చకులు ఆశీస్సులందజేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఈ కుంభాభిషేక



మహోత్సవంలో పాల్గొని, అద్వితీయమైన అలంకారంతో శోభాయమానంగా కొలువైవున్న శ్రీరాజరాజేశ్వరి అమ్మవారిని దర్శించుకుని తరించిపోయారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కోవూరు జనార్ధన్‌రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు ఎస్.రఘురామమూర్తి, వేద పండితులు, సిబ్బంది పర్యవేక్షించారు.

# క్వార్ట్జ కర్మాగార స్థాపన విరమించుకున్న వీపీఆర్

(మొదటిపేజీ తరువాయి)

వివరాలలోకి వెళ్తే...

ఉమ్మడి నెల్లూరుజిల్లాలో లభిస్తున్న క్వార్ట్జ్ లక్షల టన్నులు గత కొన్ని సంవత్సరాలుగా అక్రమార్కుల నీడలో విదేశాలకి తరలిపోతున్న విషయం బహిరంగ రహస్యమే. గత వైసీపీ ప్రభుత్వంలోని బడా లీడర్ల దగ్గర నుండి చోటా నాయకుల వరకూ ఈ సహజ ఖనిజ దోపిడీలో భాగస్వాములే. అయితే, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి ఒక కొత్త ఆలోచనకి తెరలేపారు. మన దేశం నుండి విదేశాలకి తరలిపోతున్న సహజ ఖనిజాన్ని మన దేశంలోనే సద్వినియోగం చేసుకునేలా ప్రణాళిక రచించారు. అందుకోసం అవసరమైన చైనా తరహా కర్మాగారాన్ని 400కోట్ల రూపాయల పెట్టుబడితో మన రాష్ట్రంలోనే నెలకొల్పాలన్న ఆలోచన చేశారు. ఈ కర్మాగారం ద్వారా 1000 మందికి ఉపాధి అవకాశం లభిస్తుందని కూడా అంచనా వేశారు. అందుకు అవసరమైన అనుమతులని ప్రభుత్వ పెద్దల నుండి పొందారు.

ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకి పాల్పడ కుండా లీగల్‌గా అవసరమైన క్వార్ట్జ్ ఖనిజాన్ని తవ్వుకుంటున్న వారి దగ్గర నుండి మెటీరియల్ సేకరించి ఎగుమతి చేసుకోవడానికి లైన్ క్లియర్ చేసుకున్నారు. ఆ ఎగుమతి చేసింది కూడా తాను పెట్టదలచిన కర్మాగారానికి అవసరమైన పరిశోధనల కోసమే వినియోగించడానికే సంకల్పించారు.

ఇందుకోసం ఆయన సొంతంగా లక్ష్మీ క్వార్ట్జ్ శాండ్ ప్రైవేట్ లిమిటెడ్, ఫేని క్వార్ట్జ్ ప్రైవేట్ లిమిటెడ్ అనే పేర్లతో రెండు సంస్థలని స్థాపించారు. ఇక్కడే అసలు కథ ప్రారంభమయ్యింది. వేమిరెడ్డి ప్రభాకర రెడ్డి లక్షల టన్నుల ఖనిజాన్ని అక్రమంగా విదేశాలకి తరలిస్తున్నారంటూ కొందరు వైసీపీ పిల్ల నాయకులు గగ్గోలు పెట్టడం ప్రారంభించారు. చిన్నసైజు మైనింగ్ కాంట్రాక్టర్లని బెదిరిస్తున్నారని తప్పుడు ప్రచారం మొదలుపెట్టారు. ఒక దినపత్రికతో పాటు, జిల్లా లోని ఓ పాత పేపరు సైతం వీపీఆర్ గుణగణా లని శంకిస్తూ ఆయనని దోపిడీదారుడిగా చిత్రిస్తూ సీరియల్‌గా వార్తలు ప్రచురించడం ప్రారంభించింది. సామాజిక మాధ్యమాల వేదికగా కూడా కొంతమంది వీపీఆర్‌పై బురద చల్లసాగారు. నిజానికి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి చట్ట వ్యతిరేకంగా అక్రమ మైనింగ్ చేయదలుచుకుంటే, ఆయన పేరుతోనే సొంత సంస్థలని ఎందుకుపెట్టుకుంటాడన్న ఆలోచన కూడా ఈ విమర్శకులకి రాలేదు. ఈ పరిణామాలన్నిటితో విసిగిపోయిన వీపీఆర్ కర్మాగారం నెలకొల్పే నిర్ణ యాన్ని విరమించుకున్నారు. తాను పెట్టిన రెండు సంస్థలని ప్రొసీజర్ అనుసరించి మూసేస్తున్నట్లు జులై 30న బుధవారం నాడు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనే స్వయంగా ప్రకటించారు.

ఈ సందర్భంగా వీపీఆర్ కొన్ని గణాంకాలని కూడా మీడియా ముందుంచారు. గత ఏడాది కాలంలో సుమారు ఒక లక్షా అరవై వేల టన్నుల ఖనిజం విదేశాలకి తరలిపోతే అందులో కేవలం పందొమ్మిది వేల టన్నులు మాత్రమే తమ సంస్థల ద్వారా ఎగుమతి అయ్యాయని వివరించారు. అంతకు ముందు ప్రభుత్వ హయాంలో ఏడాదికాలంలో సుమారు 9లక్షల టన్నులు అక్రమార్కులు ఎగుమతి చేశారని వివరించారు.

### వ్యాపారం - సేవ రెండు కళ్ళుగా...

వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిది అరుదైన మనస్తత్వం. ఓ వైపు ఒంటి చేత్తో వేలకోట్ల వ్యాపార సామ్రాజ్యాన్ని నడిపిస్తూనే మరోవైపు సేవారంగంలో తన ఉనికిని చాటుకుంటూ జిల్లావాసుల అభిమానాన్ని ఆయన చూరగొన్నారు. రాజకీయాల్లోకి రావడానికి పాతికేళ్ళ ముందు నుండే ఆయన సేవారంగంలో అగ్రగామిగా గుర్తింపు పొందారు. తన వృత్తి వ్యాపారమైతే.. వ్యాపకం సేవే అన్నట్లుగా ఆయన తమ సేవలు అందిస్తూ వస్తున్నారు. నిజానికి మన దేశంలోనూ, ఇతర దేశాలలోను ఆయనకున్న వ్యాపారాలతో పోలిస్తే.. ఈ మైనింగ్ వ్యాపారం ఒక శాతం కూడా ఉండదు. జిల్లాకి ఏదో ఒక మంచి కార్యక్రమం చేయాలనే లక్ష్యంతోనే ఆయన క్వార్ట్జ్ కర్మాగారాన్ని నెలకొల్పాలనుకున్నారు. ప్రత్యేక బృందాన్ని చైనాకి పంపించి పరిశోధనలు కూడా చేయించారు. తాము ఎగుమతి చేసిన 19వేల టన్నులు కూడా ఈ పరిశో ధనలో భాగమే. అందుకోసం ఇప్పటికే లక్షల రూపా యలు కూడా ఖర్చు చేశారు. అనవసరమైన ఆరోపణ లతో ఆయనని అభాసుపాలు చేయడంతో ఇప్పుడు ఫ్యాక్టరీ స్థాపన నిర్ణయాన్ని విరమించుకున్నారు. తాము స్థాపించిన రెండు సంస్థలని రూల్స్ ప్రకారం క్లోజింగ్ ప్రక్రియ(ప్రొసీజర్)ని అనుసరించి మూసేస్తు న్నట్లు ప్రకటించారు. తాను పెట్టదలుచుకున్న కర్మా గారానికి మంచి భవిష్యత్తు ఉంటుందని, తనకి బదులుగా వేరెవరైనా ఆ కర్మాగారాన్ని పెట్టదలుచు కుంటే తన పూర్తి సహాయసహకారాలు అందిస్తానని ఆయన ఈ సందర్భంగా ప్రకటించారు.

తనకి విమర్శలు నచ్చవని, తన సొంత జిల్లాలోనే తనని ఇలా అవమానించడం బాధాకరమని వీపీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. తనకి దైవబలం ఎక్కువని, ఇంకా ఎవరైనా తనపై తప్పుడు రాతలు రాస్తే వారికి భగవంతుడే బుద్ధి చెప్తాడని అన్నారు.



### పునరాలోచించాలి...

"ఏనుగులు పోతుంటే కుక్కలు మొరుగుతాయి" అన్నది సామెత. అంత మాత్రానికే ఏనుగు ఎలుకై పోదు. ఇదీ అంతే. ఏదైనా మంచి పని చేయాలను కున్నప్పుడు అనేక దుష్టగ్రహాలు అడ్డు తగుల్తుంటాయి. వాటన్నిటినీ అధిగమించి అనుకున్నది సాధించాలి. వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి విషయంలో అదే జరిగింది. ఆయన ఐరావతమంటి వ్యక్తి. ఆయనకి వున్న కీర్తిప్రతిష్టలు అపారం. వాటిని మరకంటించడం ఎవరికీ సాధ్యం కాదు. ఆయన ఒక్కసారి పునరా లోచించాలని, జిల్లాకి మంచి చేయదలుచుకున్నప్పుడు, అన్ని రకాల అవరోధాలను నిర్భయంగా ఎదుర్కొని ముందుకు సాగాలని ఆయన అభిమానులు కోరు తున్నారు. "మేమంతా మీతోనే ఉంటాం... మీకు అండదండలు అందిస్తాం" అంటూ భరోసా ఇస్తు న్నారు. ఇక నిర్ణయం ఆయన చేతుల్లోనే ఉంది...!

# రైతుల సంక్షేమమే ధ్యేయం

## - మంత్రి ఆనం

రైతన్నల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. జులై 31న నెల్లూరుజిల్లా ఏఎస్‌పేట మండలం చిన్నబ్బీపురంలో శ్రీ కోదండరామ స్వామి ఆలయం కుంభాభిషేకం, విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆ ఊరి రైతులకు ఆయన డ్రోన్‌స్ప్రేయర్లు పంపిణీ చేశారు. రైతుల అభ్యున్నతికోసం ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తోందని, వ్యవసాయం సులభ తరం చేసి, ఖర్చులు తగ్గించాలనే లక్ష్యంతో పెద్దఎత్తున సబ్సిడీపై డ్రోన్ స్ప్రేయర్లను అందిస్తున్నామన్నారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న ఆత్మకూరు నియోజకవర్గంలో 10 వ్యవసాయ గ్రూపులకు డ్రోన్‌స్ప్రేయర్లు మంజూరయ్యాయని, ఇప్పుడు 6 గ్రూపులకు పంపిణీ చేస్తున్నామని, ఇంకా 4 గ్రూపులకు అవకాశం ఉందని తెలిపారు. కేవలం 2 లక్షలు రైతులు చెల్లిస్తే, 8 లక్షల సబ్సిడీతో ప్రభుత్వం 10లక్షల విలువైన డ్రోన్ స్ప్రేయర్లను అందిస్తుందని, రైతులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

# సేవాసంస్థలకు.. 2 లక్షల విరాళం




నెల్లూరు మూలపేట వాస్తవ్యులు.. పంచాయతీరాజ్ శాఖ-గూడూరులో టెక్నికల్ ఆఫీసర్‌గా ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన గిరీష్‌బాబు సింహపురి వైద్య సేవాసమితి (జయభారత్ హాస్పిటల్) మరియు జనహిత(వాత్సల్య) సంస్థలకు లక్ష రూపాయలు చొప్పున, రెండు సంస్థలకు రెండు లక్షలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, వైద్య రంగాలలో సేవలందిస్తున్న ఆ సంస్థలకు, తన ఉద్యోగ విరమణ ద్వారా వచ్చే మొత్తంలో ఆ విరాళం అందచేశానని తెలిపారు. ఇదే కాకుండా తమతో పాటు పనిచేస్తున్న డ్రైవర్ కుమార్తెకు గృహనిర్మాణ ఆపరేషన్ కోసం 10వేలు, స్వీపర్, స్కావెంజర్, వాచ్‌మెన్‌లకు కూడా పదివేల రూపాయల చొప్పున తమ సాయంగా అందచేశారు. ఉద్యోగ విరమణ తరువాత సేవా సంస్థలో స్వచ్ఛందంగా సేవచేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వాత్సల్య ప్రతినిధులు సాంబశివరావు, దుర్గాప్రసాద్, జయభారత్ ఆసుపత్రి ప్రతినిధులు గురుప్రసాద్, పట్టాభి తదితరులు పాల్గొన్నారు. విరాళం అందించిన దాత గిరీష్‌బాబును అభినందించి సన్మానించారు.

లాయర్
ఆగస్టు 01, 2025

# చాపకింద నీరులా.. 'క్షయ'వ్యాధి!

కరోనా తర్వాత దేశంలో ఆరోగ్యంపై సర్వత్రా ఆసక్తి పెరుగుతుండడం హర్షదాయకమే. అయితే, మనం ఎన్నిరకాల జాగ్రత్తలు తీసుకుంటున్నా దొడ్డిదారుల్లో రకరకాల వ్యాధుల బాధలు చుట్టుముడుతూనే ఉన్నాయి. కంటికి కనిపించని క్రిమిలా కరోనా రాకాసి వస్తే, గాలిలోనే వచ్చే అంటువ్యాధులు కూడా ప్రజల ప్రాణాలకు ముప్పును తెస్తున్నాయి. అందులోనూ, క్షయ వ్యాధి వంటి అంటువ్యాధులు చాపకింద నీరులా పొంచివుంటున్నాయి. ఈ వ్యాధి ఎంతోకాలంగా కోరలు చాస్తూనే ఉంది. వైద్యశాస్త్రపరంగా మనం ఎంతో అభివృద్ధి చెందుతూనే ఉన్నా, టీబీ వ్యాధి మాత్రం నిశ్శబ్దంగా తనపాటికి తాను వ్యాపిస్తూనే ఉంది. ఏటా లక్షలాదిమందిని నానా యాతనలకు గురిచేస్తూనే ఉంది. దీని వల్ల 2023లో ప్రపంచవ్యాప్తంగా సుమారు 12 లక్షల మందికి పైగానే మరణించి ఉంటారని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఓ) చెప్తోంది. అన్ని దేశాల్లో కంటే మనదేశంలోనే క్షయవ్యాధి (దీనినే టీబీ వ్యాధి అని కూడా అంటారు) బాగా పెరిగిపోతోందని కూడా డబ్ల్యుహెచ్ఓ హెచ్చరిస్తోంది. ప్రపంచంలో నమోదైన క్షయ కేసుల్లో దాదాపు 27 శాతం ఒక్క భారత్‌లోనే ఉన్నాయని నిపుణుల నివేదికలు వెల్లడిస్తున్నాయి. 2020లో ఈ వ్యాధికి 2.20 లక్షల మంది మృతిచెందివుంటారని అంచనా. గణాంకాలను బట్టి చూస్తే, ప్రతి మూడు నిమిషాలకు ఇద్దరు ఈ వ్యాధికి బలైపోతున్నారు. 2023లో 85వేల మంది టీబీతో చనిపోయారంటే మన దేశంలో ఆ వ్యాధి విజృంభణ ఎంత తీవ్రంగా ఉంటోందో తేటతెల్లమవుతుంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ వ్యాధిని నివారించడానికి ఏటా కోట్లాది రూపాయలు వెచ్చిస్తూనే ఉన్నాయి. టీబీ కేసులు.. మరణాలు కొంతమేరకు తగ్గుతున్నాయి కానీ, పూర్తిస్థాయిలో వ్యాధి నివారణకు మరింతగా కృషిచేయాల్సి ఉంది. 2025 నాటికి దేశంలో ఈ వ్యాధిని పూర్తిగా నివారించాలని ప్రభుత్వాలు పట్టుదలతో ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడు అధునాతన చికిత్సా విధానాలు అందుబాటులోకి రావడంతో ఇలాంటి వ్యాధులను నయం చేసుకోవడం గతంలో కంటే సులభమే. అయినా, దేశంలోని అనేక రాష్ట్రాల్లో నేటికీ టీబీ బాగా ప్రబలుతూనే ఉంది. వాటికి ప్రధాన కారణం రోగ నిరోధకశక్తి తగ్గిపోవడం, పౌష్టికాహారం లేకపోవడం వంటివి. పేదరికమే శాపంగా ఉన్నవారికి ఇలాంటి వ్యాధులు సహజంగానే అంటుకుంటూనే ఉంటాయి. ఈ వ్యాధి ముఖ్యంగా బ్యాక్టీరియా వల్ల వస్తుంది. ఊపిరితిత్తులపై ప్రభావం చూపుతుంది. అలా ఆ వ్యాధి బారినపడిన రోగి దగ్గితేనో, తుమ్మితేనో గాలిలోంచే అది ఇతరత్రా వ్యాప్తి చెందుతుంది. మధుమేహవ్యాధిగ్రస్తులను, ముసలివాళ్లను, చిన్నారులను ఈ వ్యాధి సులభంగా ఆవహిస్తూ ఉంటుంది. మరోవైపు దురలవాట్ల వల్ల, ముఖ్యంగా పొగాకు వాడడం, ధూమపానం, మద్యం సేవించడం వంటివాటి వల్ల క్షయవ్యాధికి గురవుతున్న వారి సంఖ్య కూడా బాగా పెరుగుతోంది. టీబీని గుర్తించడం చాలా తేలిక అయినప్పటికీ, దానిని చాలామంది నిర్లక్ష్యం చేస్తున్నారు. పట్టణాలు, నగరాలు, ఇరుకిరుకుగా ఉండే నివాస ప్రాంతాల్లో ఈ వ్యాధి ప్రబలుతూ ఉంటుంది. ఎక్కువగా దగ్గు రావడం, కొన్నిసార్లు నోటినుంచి రక్తం పడడం, ఛాతీ నొప్పి, బలహీనంగా నిస్సత్తువగా ఉండడం, బరువు తగ్గిపోవడం, తరచూ జ్వరం వస్తుండడం, రాత్రివేళలో చెమటలు పడుతుండడం వంటివి టీబీ లక్షణాలుగా చెప్పుకోవచ్చు. తమకు టీబీ వచ్చి ఉన్నా, చాలామంది గ్రహించలేరు. ఎందుకంటే దాని ప్రారంభ లక్షణాలు అంత తేలిగ్గా ఉంటాయి. ప్రాథమికంగానే గుర్తించి, క్రమబద్ధంగా చికిత్సలు చేయించుకంటే ఈ వ్యాధిని నివారించుకోవడం తేలిక. అది తీవ్రమైతే మాత్రం దాని నుంచి బయటపడడం కష్టం. ఒకవేళ టీబీ ఉన్నా, వైద్యులు సూచించిన మేరకు మందులన్నీ క్రమబద్ధంగా వాడితే ఎంతో ప్రయోజనం ఉంటుంది. ఆమేరకు ప్రతి ఒక్కరికీ ఆ వ్యాధి గురించి, దాని ప్రాథమిక లక్షణాలు, నివారణోపాయాల గురించి ప్రభుత్వాలు మరింత పెద్దఎత్తున ప్రజలకు అవగాహన కలిగించాలి. వ్యాధి వచ్చాక బాధలు పడేకంటే, వ్యాధి రాకముందే తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలి. ఎప్పటికప్పుడు ఈ వ్యాధిపట్ల అందరూ అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి. ఏదేమైనా, క్షయ వంటి వ్యాధులు తగ్గిపోతాయిలే అనుకోకుండా, వాటిపట్ల దృష్టిపెట్టడం అవసరం. వ్యాధిగ్రస్తులను గుర్తించడమే కాక, ప్రత్యేక వార్డులు లేదా ఆసుపత్రుల్లో చికిత్సలు చేయించి వారిని ఆ వ్యాధి బారి నుంచి రక్షించాలి. ప్రభుత్వాలు, వైద్య వర్గాలు క్షయ లాంటి అంటువ్యాధుల నివారణకు శాశ్వత ప్రాతిపదికపై చర్యలు తీసుకోవడం కూడా అవసరమే!....

# రాజకీయ నాయకులేమైనా చట్టానికి అతీతులా?




రాజకీయ పార్టీలు, నాయకుల విషయంలో కేంద్రప్రభుత్వ దర్యాప్తుసంస్థలు సిబిఐ, ఈడీలు అతిగా జోక్యం చేసుకుంటున్నాయని ఇటీవల సుప్రీం కోర్టు కామెంట్ చేసింది. "కేంద్ర దర్యాప్తు సంస్థలు హద్దు దాటుతున్నాయి అంటూ' చురకలు అంటించింది. 'మిమ్మల్ని రాజకీయాలకి ఎందుకు వాడుతున్నారు...?' అంటూ ప్రశ్నించింది. అయితే, ఇక్కడ నాకో సందేహం వస్తోంది. ఇటీవలి కాలంలో ఎక్కువగా అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రబుద్ధులు రాజకీయ నాయకులే. ముఖ్యంగా మంత్రులుగా, ముఖ్యమంత్రులుగా, కేంద్ర మంత్రులుగా పనిచేసిన వారే అవినీతి, మనీ లాండరింగ్ వంటి విషయాలలో అగ్రగణ్యులుగా ఉంటున్నారు. మరి అలాంటప్పుడు కేంద్ర దర్యాప్తు సంస్థలు వాళ్ళని ప్రశ్నిస్తే తప్పేమిటి అన్నది నా సందేహం. రాజకీయ నాయకులైనంత మాత్రాన వాళ్ళేమీ చట్టానికి అతీతులు కాదు కదా. అలాంటప్పుడు వాళ్ళు చేసిన నేరాలని బహిర్గతం చేయవలసిన బాధ్యత కేంద్ర దర్యాప్తు సంస్థలదే కదా. మరి రాజకీయ నేతల జోలికి మీరెందుకువెళ్తున్నారు అని సుప్రీం పెద్దలు ప్రశ్నించడం ఎంతవరకూ సమంజసం..? కోర్టు అభిప్రాయంతో విభేదించడం నా అభిమతం కాదు. ఓ సామాన్య పౌరుడిగా ఇది నాకు వచ్చిన అనుమానం మాత్రమే. చట్టం ముందు అందరూ సమానమే అన్న విషయం ఎవరైనా గుర్తుంచుకోవలసిందే.

*యం. చంద్రమౌళి*, **కొత్తఢిల్లీ.**

# అరెస్టు చేస్తే.. జగన్‌రెడ్డికే లాభం!

మద్యం కుంభకోణంలో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని అరెస్టు చేస్తారన్న వార్త విస్తృతంగా ప్రచారంలో ఉంది. ఇప్పటికే ఆ పార్టీ నాయకులు చాలామంది జైళ్ళలో ఉన్నారు. ఇక జగన్‌రెడ్డిని కూడా అరెస్టుచేస్తే ఆయనకి, ఆయన పార్టీకి లాభమే తప్ప నష్టం ఉండదని నా అభిప్రాయం. అరెస్టు అవ్వడానికి కారణం ఏదైనా, ఆ నేరం ఎంత పెద్దదైనా దానిని మరపించే స్థాయిలో ప్రజల సానుభూతిని పొందడం మన నాయకులకి అలవాటే కదా..! ముఖ్యంగా జగన్‌కి అరెస్టులు, జైళ్ళు కొత్తేమీ కాదు. గతంలో ఓసారి 16నెలల పాటు ఆయన జైలులో గడిపాడు. ఇప్పటికీ పదేళ్ళుగా బెయిలు పైనే బయట ఉన్నాడు. ఇప్పుడు కొత్తగా పెట్టే కేసులవల్ల ఆయనకి జరిగే నష్టం కన్నా లాభమే ఎక్కువ అని నా ఉద్దేశ్యం. ప్రతికూల అంశాన్ని కూడా తమకి అనుకూలంగా మలుచుకోవడంలో రాజకీయ నాయకులు వాళ్లకి వాళ్ళే సాటి సుమా!

*– జీ.వీ.సుబ్బయ్య*, **పిడుగురాళ్ళ.**

# అమ్మో ఆడోళ్ళు!

గత వారం మన 'లాయర్'లో వచ్చిన "మమతలేని మగువలు – తేనె పూసిన కత్తులు" వ్యాసం చదువుతుంటేనే వెన్నులో వణుకు పుట్టింది. మహిళలు ఎంత బరితెగించిపోయారో తెలుసుకుంటుంటే భయమేస్తోంది. రోజూ టీవీ సీరియళ్ళలో కనిపిస్తున్న మహిళా విలన్లని చూసి సమాజంలో ఆడవాళ్ళు కూడా అలాగే తయారవుతున్నారేమో అన్న ఆలోచన కలుగుతోంది. ఘోరాతిఘోరమైన సంఘటనలని వ్యాసకర్త బాలుబాబు కళ్ళకి కట్టినట్లుగా వివరించారు. సభ్య సమాజంలో సాటి మహిళలు సిగ్గుతో తలదించుకునేలా కొంతమంది ఆడవాళ్ళు ప్రవర్తించడం అత్యంత శోచనీయం. ఇలా మహిళల్లో సైతం నేర ప్రవృత్తి పెరిగిపోతే ఇక ఈ సమాజాన్ని ఆ భగవంతుడే కాపాడాలి. అమ్మో ఆడోళ్ళు! *– దుగ్గిళ్ళ కార్తీక్*, **నెల్లూరు.**

## సత్యపీఠం
నిజాలే మాట్లాడుకుందాం! 101

# అరా కొరా వసతులతో.. సం'క్షోభ' హాస్టళ్లు!

విద్యార్థులకు సంక్షేమాన్ని అందించాల్సిన ప్రభుత్వ హాస్టళ్లు సంక్షోభాన్ని అందిస్తున్నాయి. బాలల క్షేమానికి శ్రీరామరక్షగా ఉండాల్సిన వసతి గృహాలు, క్షోభనే మిగిలిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని సంక్షేమ వసతిగృహాలు (హాస్టళ్లు) సంవత్సరాల తరబడి ఇలాంటి దురవస్థలోనే వర్ధిల్లుతున్నాయి. విద్యార్థులు, విద్యార్థి సంఘాలు, పత్రికలు ఎంతగా మొత్తుకున్నా వాటిలో ఆశించిన మేరకు మార్పు రావడం లేదు. హాస్టళ్లలో చదువుకుంటున్న లక్షలాదిమంది నిరుపేదపిల్లలు నిత్యం అరాకొరా వసతులతో అవస్థలు పడుతూనే ఉన్నారు. గత వైకాపా హయాంలో హాస్టళ్ళ అతీగతీ పట్టించుకునే వారే లేకపోవడంతో వాటి పరిస్థితి మరీ అధ్వాన్నంగా ఉండేది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాక హాస్టళ్ళ బాగుకు నడుంబిగించడంతో, పరిస్థితులు కొంత మెరుగు పడుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో హాస్టళ్ళ నిర్వాహకులు సక్రమంగా పట్టించుకోకపోవడం, సరైన పర్యవేక్షణ లేకపోవడంతో వాటి పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్నట్లుగా ఉంటోంది. రాష్ట్రంలో వందలు వేలసంఖ్యలోనే ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లున్నాయి. ఎస్సీ,ఎస్టీ , బీసీహాస్టళ్లు, వాటిలో కూడా ప్రత్యేకించి కొన్ని బాలురకు, కొన్ని బాలికలకు వేరు వేరుగా కూడా ఉంటున్నాయి. ఇవి కాక, గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు బోలెడన్ని. అయితే, నిరుపేద విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి, వారి భవితకు బంగారుబాటలు వేయాల్సిన హాస్టళ్లు సమస్యల లోగిళ్ళుగానే ఉంటున్నాయి. చాలీచాలని గదులు, శిథిల భవనాలు, పరిశుభ్రత లేని పరిసరాలతో అనేక హాస్టళ్లు..వాటి అనుబంధ పాఠశాలలు అసౌకర్యాల పుట్టలుగా దర్శనమిస్తున్నాయి. నేటికీ చాలాచోట్ల చెట్లకింద చదువులు కొనసాగుతూనే ఉన్నాయి. కొన్నిచోట్ల ముళ్ళ కంపలు పెరిగిపోయి హాస్టళ్లలో పాములు తిరుగుతుంటాయి. పిల్లలంతా రాత్రీపగలు బిక్కుబిక్కుమంటూ జీవిస్తుంటారు. తమకు కనీస సౌకర్యాలు కూడా లేవని ఎవరికైనా చెప్తే, మొదటికే మోసం వస్తుందని విద్యార్థులు తమ బాధలను ఎవరికీ చెప్పుకోలేక లోలోపలే కుమిలిపోతుంటారు. సరైన మంచినీటి వసతులు, పడుకోవడానికి కనీసం చింకిచాపలు, దుప్పట్లు కూడా లేక విద్యార్థులు నేలమీదనే కూర్చుని చదువుకుంటూ, అక్కడే పడుకుంటూ ఉంటారు. మూత్రశాలలు, మరుగుదొడ్లు కూడా సరిగా ఉండవు. అనేక హాస్టళ్లలో పాసిపోయిన అన్నం కూరలే పరమాన్నంగా తినాల్సిన దుస్థితి. చదువుకునేందుకు తగ్గ వాతావరణం, మంచి వసతులు ఉండాల్సిన హాస్టళ్ళు, దశాబ్దాల తరబడి ఎదుగుబొదుగూ లేకుండా ఉండడం తల్లితండ్రులకు వేదన కలిగిస్తోంది.

## మన పిల్లలనైతే ఇలాగే చూస్తామా?

**-హాస్టళ్ళ తీరుపై హైకోర్టు ఆగ్రహం**

రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ హాస్టళ్ళ తీరు బాగాలేకపోవడంపై నేరుగా హైకోర్టే అసంతృప్తి వ్యక్తం చేసింది. గతం(2023)లో దాఖలైన ఓ ప్రజాప్రయోజన వ్యాజ్యం ఇటీవల హైకోర్టు ధర్మాసనం విచారణకు రాగా, హాస్టళ్ళలో విద్యార్థులు నేలమీదనే పడుకోవడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేసింది. మన పిల్లలనైతే ఇలాగే చూస్తామా? అంటూ నిలదీసింది. హాస్టళ్ళ వసతుల కోసమని ఏటా కేటాయిస్తున్న వందల కోట్ల రూపాయలు ఎక్కడికి పోతున్నాయని ప్రశ్నించింది. జాతీయ బాలల హక్కుల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం, బెడ్‌లు, దుప్పట్లు, మంచినీరు, మరుగుదొడ్ల వంటి సౌకర్యాలన్నీ ఉండాలి కదా, వాటిని ఏర్పాటుచేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే కదా, అలాంటిది ప్రభుత్వానికి హాస్టళ్ళలో పిల్లల అవస్తలు కనిపించడం లేదా? అంటూ ప్రశ్నించింది. హాస్టళ్లలో పరిస్థితులు దయనీయంగా ఉంటున్నా అధికారులు ఏమీ తెలియనట్లు మౌనంగా ఉండడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. జిల్లాలో సీనియర్ అధికారులు క్రమం తప్పకుండా హాస్టళ్ళను తనిఖీ చేయాలని, ఎవరెవరు ఎప్పుడెప్పుడు తనిఖీలు చేశారో, వారి పేర్లను తమకు తెలియజేయాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. వసతుల మెరుగుదలకు సంబంధించిన నివేదికలను ప్రతినెలా తమకు సమర్పించాలని కూడా స్పష్టంచేసింది.

## నిర్లక్ష్యం వీడాలి.. ఇకనైనా మారాలి :

ఎంతోకాలంగా..హాస్టళ్ల చదువులు పరమ ఘోరంగా ఉంటాయన్న అపవాదు ఇకనైనా తొలగిపోవాలంటే, సంబంధిత అధికారులు చిత్తశుద్ధితో చర్యలు తీసుకోవాలి. హాస్టళ్లలో చదువుకునే నిరుపేదలంటే చాలామందికి చులకనభావం ఉంటోంది. అలాంటి భావనలను ముందుగా వాటి నిర్వాహకులు మనసుల్లోంచి తొలగించుకోవాలి. పిల్లలందరూ ఒకటేనన్న సద్భావనతో వారి చదువులకి ఇబ్బంది లేకుండా చూడాలి. కన్నవారినీ, ఉన్న ఊళ్ళను వదిలిపెట్టి, అసహాయస్థితిలో హాస్టళ్లలో చదువుకుంటున్న పిల్లలకి ఇక్కడ ఏ ఇబ్బందీ ఉండదనే భరోసా ఉండేలా చూడాలి. హైకోర్టు చెప్పినట్లు అది అక్షరాలా ప్రభుత్వ బాధ్యత. దానిని అన్నివేళలా సక్రమంగా నెరవేర్చాలి. హాస్టళ్ళలో చదువుకున్న విద్యార్థులెంతోమంది అపార ప్రతిభతో రాణిస్తూ, దేశపురోగతిలో భాగస్వాములవుతున్నారు. సమాజంలో ఉన్నతస్థానాల్లో ఉంటున్నారు. ఆ విషయాలని ప్రభుత్వ పెద్దలు గమనించాలి. దురదృష్టవశాత్తూ కుటుంబ పరిస్థితులు బాగా లేక, హాస్టళ్ళలోనైనా చదువుకుని తమ తల్లితండ్రులను కష్టాల నుంచి గట్టెక్కించాలని చాలామంది పేద, బడుగు, బలహీన వర్గాల కుటుంబాలకి చెందిన పిల్లలు, ఇలా ఎన్ని కష్టాలనైనా భరిస్తుంటారన్న విషయాన్ని అధికారులు మానవతా హృదయంతో అర్థం చేసుకోవాలి. ఇకనైనా హాస్టళ్ల నిర్వహణలో పాలకులు మరింత పటిష్టమైన చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా నిర్వహణ లోపభూయిష్టం కాకుండా చూడాలి. అందుకు, సంబంధిత అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది తీరు కూడా మారాలి. ఏదేమైనా, పేదరికం వల్ల హాస్టళ్లలో చేరి చదువుకుంటున్న ఆ అభాగ్యుల పట్ల నిర్లక్ష్యం వీడాలి. వారిలో నాణ్యమైన విద్యా వెలుగులు నింపాలి. అందుకు అవసరమైన వసతులకు ఏమాత్రం కొరత లేకుండా చూడాలి.

**- రాజశ్రీ**

# పీ-4తో గిరిజనులకు వెలుగు బాటలు

## సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి సారధ్యంలో, ప్రభుత్వం ఇటీవల ప్రవేశ పెట్టిన పీ-4 కార్యక్రమం అమాయకులైన నిరుపేద గిరిజనుల జీవితాలకు వెలుగు బాటలు వేస్తోందని మాజీమంత్రి, సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పారు. సర్వేపల్లిలో ఈ కార్యక్రమం ఎంతో సత్ఫలితాలనిస్తోందని సంతోషం వ్యక్తం చేశారు. ఇటీవల ఆయన సర్వేపల్లి నియోజకవర్గంలోని బ్రహ్మదేవం కట్ట మీద గిరిజన కాలనీని దత్తత తీసుకున్న జెమిని పామాయిల్ కంపెనీ వారిని అభినందించారు. దేవరదిబ్బ గిరిజన కాలనీని సెంబ్‌కార్ప్ కంపెనీకి అప్పగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని, అదేవిధంగా, మిగిలిన కంపెనీలతోనూ సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపారు. పీ-4 కార్యక్రమం ద్వారా గిరిజనుల జీవితాలను బాగు చేసేందుకు ముందుకొస్తున్న కంపెనీలకు ధన్యవాదాలు తెలియజేశారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం ముత్తుకూరు మండలం బ్రహ్మదేవం పంచాయతీలో ఆయన పర్యటించి, జెమిని కంపెనీ ప్రతినిధులతో కలిసి గిరిజనుల ఇళ్ళను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పీ4 కార్యక్రమంలో భాగంగా ముత్తుకూరు, కృష్ణపట్నం పంచాయతీల అభివృద్ధి బాధ్యతను అదానీ కృష్ణపట్నం పోర్టు చేపట్టిందని, సెంబ్ కార్ప్ (ఎస్ఇఐఎల్) కంపెనీ రూ. 1.95 కోట్లతో ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన వసతులు కల్పిస్తోందని, మరో 40 ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసే ప్రయత్నంలో ఉన్నారని తెలిపారు. జెమిని కంపెనీ విజయవాడ వరదల సమయంలోనూ ఉదారంగా స్పందించి రూ. 2 కోట్ల విరాళాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి అందజేసిందని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేస్తూ, పేదలను ఆదుకోవడంలో ముందు నిలుస్తున్న పరిశ్రమల యాజమాన్యాలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# నిత్యం ప్రజల్లో ఉండడమే ఇష్టం

## రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి




నిత్యం తమ నియోజకవర్గ ప్రజల అభ్యున్నతికి కృషిచేస్తూ, ప్రజల్లో ఉండడమే తనకెంతో ఇష్టమని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చెప్పారు. ఇటీవల రూరల్‌లోని అపార్ట్‌మెంట్‌లలో నివసిస్తున్న ప్రజల మనోభావాలు తెలుసుకునేందుకు ఆయన 'అపార్ట్‌మెంట్ల బాట' పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. నెల్లూరురూరల్‌లో దాదాపు 7వేల కుటుంబాలు అపార్ట్‌మెంట్‌లలో నివసిస్తున్నాయని, ప్రభుత్వ సహకారంతో తాము చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల పట్ల వారి మనోభావాలు తెలుసుకునేందుకే ఈ కార్యక్రమం ఏర్పాటుచేశామని, వారి సూచనలు సలహాలు తీసుకుంటామని ఆయన అన్నారు. ఇటీవల ఆయన 19వ డివిజన్‌లో పర్యటిస్తూ, ఈ సంవత్సర కాలంలో చేసిన అనేక అభివృద్ధి పనులను ఆయన ప్రజలకు వివరించారు. క్లస్టర్ ఇంచార్జ్ నూకరాజు మదన్‌కుమార్‌రెడ్డి, స్థానిక డివిజన్ కార్పొరేటర్ మారంరెడ్డి జ్యోతి ప్రియ, డివిజన్ అధ్యక్షులు బొప్పూరు ప్రసాద్ మరియు స్థానిక అపార్ట్‌మెంట్ వాసులు పాల్గొన్నారు.

### అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలి :

నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఇటీవల ఆయన 22వ డివిజన్‌లో 50 లక్షల రూపాయల వ్యయంతో సీసీ రోడ్లు, సీసీ డ్రైన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 22వ డివిజన్ అభివృద్ధికి 3 కోట్ల 25 లక్షల రూపాయల నిధులు కేటయించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి ప్రజలందరి ఆశీస్సులు ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మూలే విజయభాస్కర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు రాయ యానాదిరెడ్డి, బీజేపీ నాయకులు యరబోలు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మకూరులో బంగారు కుటుంబాలు

**నాలుగు కుటుంబాలను దత్తత తీసుకున్న మార్గదర్శకులు**

**రాష్ట్రంలోనే ప్రప్రథమం**



***ఆంధ్రప్రదేశ్‌లో దారిద్రరేఖకు దిగువన ఉండే కుటుంబాలను బంగారు కుటుంబాలుగా మార్చడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రూపొందించిన పి4 పథకం ద్వారా ఆత్మకూరు నియోజకవర్గంలోని పలు కుటుంబాలను మార్గదర్శకులకి దత్తత ఇచ్చే కార్యక్రమాన్ని ప్రభుత్వాధికారులు వేగవంతంగా నిర్వహిస్తున్నారు. సీఎం ఆశయానికి అనుగుణంగా నిరుపేద కుటుంబాలను గుర్తించి వాటిని బంగారు కుటుంబాలుగా మార్చేందుకు ప్రత్యేకశ్రద్ధ కనబరుస్తున్నారు. నిరుపేద కుటుంబాలకి మార్గదర్శకులుగా ఉండే వ్యక్తుల ద్వారా అభివృద్ధి పరిచే ఈ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలో ఇప్పటికే నాలుగు కుటుంబాలను దాతలు దత్తతగా స్వీకరించారు.***

గత మే 1వ తేదీన నెల్లూరుజిల్లా ఆత్మకూరులో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఈ పి -4 పథకాన్ని ప్రకటించారు. అనంతరం ఆత్మకూరు మండలం చెర్లోయడవల్లి గ్రామం నుండి ఒక పేద కుటుంబాన్ని, ఇదే మండలంలో నెల్లూరుపాలెం నుండి మరో రెండు పేద కుటుంబాలని, మర్రిపాడు మండలం నుండి ఇంకో నిరుపేద కుటుంబాన్ని దాతలు ఎంపిక చేసుకుని వారి కుటుంబాలని బంగారు కుటుంబాలుగా మార్చేందుకు మార్గదర్శకులుగా అవతరించి దత్తత తీసుకున్నారు. ఈ నాలుగు కుటుంబాలకు అవసరమైన ఆర్థిక సహాయ సహకారాలను సదరు దాతలు అందించారు. దాతల సహకారాన్ని సంతోషంగా స్వీకరించిన బంగారు కుటుంబం సభ్యులు తమని ఆదుకుని తమ జీవన స్థితిగతులని మార్చిన మార్గదర్శకులకి ధన్యవాదాలు తెలిపారు.

ఈ సందర్భంగా ఆత్మకూరు ఆర్డీవో పావని మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం సదాశయంతో రూపొందించిన ఈ కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలో బంగారు కుటుంబం పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. తాజాగా ఆత్మకూరులో జరిగిన ఓ కార్యక్రమంలో బంగారు కుటుంబాలను వాటి మార్గదర్శకులను మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ఆర్డీఓ పరిచయం చేశారు. ఆర్డిఓ కృషిని మంత్రి అభినందించారు.

ఈ క్రమంలో భాగంగా ఆత్మకూరు మండలం చెర్లో యడవల్లికి చెందిన బిక్షాటన చేసుకొని బ్రతికే జ్ఞానమ్మ అనే ఓ గిరిజన కుటుంబాన్ని బంగారు కుటుంబంగా గుర్తించి వారి జీవన విధానాన్ని మార్గదర్శకులు మార్చేశారు. ఇదే తరహాలో మరికొన్ని కుటుంబాలను కూడా మార్గదర్శకులు దత్తత తీసుకొని వాటిని బంగారు కుటుంబాలుగా మార్చే కార్యక్రమాన్ని ఆత్మకూరు ఆర్డీవో ప్రతిష్టాత్మకంగా తీసుకుని అమలు చేస్తున్నారు.

ఈ కార్యక్రమం ద్వారా తమ అవసరాలు తీరుతున్నాయని, తమ బ్రతుకులు, తమ జీవనశైలి మారుతున్నాయని బంగారు కుటుంబసభ్యులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. అటు ప్రభుత్వానికి ఇటు తమ మార్గదర్శకులకి, తమని ఎంపిక చేసిన అధికారులకి కృతజ్ఞతలు తెలిపారు.

# అంతర్జాతీయ ప్రమాణాలతో డిఎస్ఆర్ఎం స్కూల్

**• డిఎస్ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో భూమిపూజ**

సేవాభావానికి మారుపేరుగా నిలిచిన డీఎస్ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో త్వరలోనే నెల్లూరులో మరో ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటుకు కృషి ప్రారంభమైంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన పీ-4 కార్యక్రమంలో భాగంగా, రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ సూచనలతో నెల్లూరు నగరంలో ఆమేరకు స్కూలు నిర్మాణానికి ఇటీవల భూమిపూజ కూడా జరిగింది. నెల్లూరు మూలాపేటలో ఉన్న దేవిరెడ్డి శారద ట్రస్టు ఆధ్వర్యంలోని డీఎస్ఆర్ మునిసిపల్ పాఠశాలలో ఆమేరకు అధునాతన నిర్మాణాలకు నగర పాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్‌తో కలసి ట్రస్టు నిర్వాహకులు పూజలు నిర్వహించి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ నందన్ మాట్లాడుతూ, వీఆర్ స్కూల్‌ను ఆధునీకరించి అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో ప్రభుత్వ పాఠశాలగా ఏర్పాటుచేసిన మంత్రి నారాయణ ఆలోచనలతో, మూలాపేటలోని డీఎస్ఆర్ఎం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన ఉండాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల ఆధునీకరణలో భాగంగా డిఎస్ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలోని మూలాపేట బాలికల



ఉన్నత పాఠశాలను, అదేవిధంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి దాతృత్వంతో స్టోన్‌హౌస్‌పేటలోని ఆర్ఎస్ఆర్ ఉన్నత పాఠశాలలో కూడా అత్యంత ఆధునిక సౌకర్యాలు కల్పించనున్నామన్నారు. దాతల ఆధ్వర్యంలో జరుగుతున్న పాఠశాలల ఆధునీకరణలను, వాటి పునర్నిర్మాణాలను త్వరలోనే పూర్తిచేయనున్నట్ల ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఆర్ ట్రస్టు ఛైర్మెన్ సుధాకర్‌రెడ్డి, వారి సోదరులు కుమార్‌రెడ్డి, ట్రస్టు సీఇఓ సాయితో పాటు టీడీపీ నాయకుడు అన్నంగి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# 27 నుంచి..అంగరంగ వైభవంగా వినాయకచవితి

**గణేష్ ఉత్సవసమితికి కొత్త కార్యవర్గం**



నెల్లూరులోని విక్రమసింహపురి గణేశ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఆగస్టు 27 నుంచి వినాయకచవితి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగనున్నాయి. ఇటీవల ఆ సమితి అధ్యక్ష కార్యదర్శులు పిట్టి సత్యనాగేశ్వరరావు, సురేంద్రరెడ్డిల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో విహెచ్‌పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ, వినాయక చవితి ఉత్సవాలు సామాజిక చైతన్యానికి ప్రతీకలని అభివర్ణించారు. అనంతరం, ఈ ఉత్సవాల నిర్వహణ కోసం కమిటీని ఏర్పాటుచేశారు. ఆ కమిటీకి గౌరవాధ్యక్షులుగా సత్యనాగేశ్వరరావు, బయ్యా శ్రీనివాసులు, గౌరవ సలహాదారులుగా సురేంద్రరెడ్డి, ఉచ్చి భువనేశ్వర ప్రసాద్, అధ్యక్షునిగా శ్రీకాంత్, కార్యనిర్వాహక అధ్యక్షునిగా వేలూరు మహేష్, ప్రధాన కార్యదర్శులుగా మండ్ల ఈశ్వరయ్య, భాస్కర్‌రెడ్డి, కార్యనిర్వాహక ప్రధాన కార్యదర్శులుగా ఫణిరాజ్, హర్షవర్ధన్, సంఘటనా కార్యదర్శులుగా మల్లికార్జునరెడ్డి, నాగ శ్రీనివాసులు, మహేష్, కోశాధికారిగా మల్లిక తదితరులు నియమితులయ్యారు.

## అందరూ చూడాల్సిన సినిమా..

# హరిహర వీరమల్లు

**- ఎమ్మెల్యే సోమిరెడ్డి**



పవన్ కళ్యాణ్ నటజీవితంలో హరిహర వీరమల్లు ఒక అద్భుత చిత్రమని, అది అందరూ చూడాల్సిన సినిమా అని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. నెల్లూరులోని ఎస్2 థియేటర్స్‌లో ఇటీవల ఆయన ఆ సినిమాని, మనుమడు రణదేవ్‌రెడ్డి, సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ నాయకులతో కలిసి చూశారు. సినిమాను చాలా బాగా తీశారని, పవన్‌కళ్యాణ్ నటన చాలా బాగుందని ఆయన ప్రశంసించారు. చాలా రోజుల తర్వాత ఒక మంచి సినిమా చూశానని, తమ ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ నటన అమోఘమని అన్నారు. పేదలకు అండగా నిలవడం, హిందూ ధర్మం కోసం పోరాడేవారికి తోడుగా నిలవడం తదితర అంశాలతో సినిమాను బాగా తీశారని, అసలు సినిమా ఎప్పుడు అయిపోయిందో కూడా తెలియలేదని ఆయన అన్నారు. గత పాతికేళ్లలో తనకు నచ్చిన సినిమాలు ఐదారు లోపే ఉంటాయని, వాటిలో హరిహర వీరమల్లు ఒకటని ఆయన అన్నారు.

## డా.కిషోర్స్ రత్నం స్కూల్‌లో..

# కార్గిల్ అమరవీరులకు నివాళి



కార్గిల్ విజయ్ దివస్‌ని పురస్కరించుకుని ఇటీవల నెల్లూరు సరస్వతి నగర్‌లోని డా.కిషోర్స్ రత్నం స్కూల్‌లో చిన్నారులకు దేశభక్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఈ సందర్భంగా సైనిక దుస్తులతో స్ఫూర్తిదాయకంగా నిలిచారు. అతిథులుగా వచ్చిన సుబేదార్ హేమంత్‌కుమార్, నాయక్ మహేష్‌లకు వందనం సమర్పించారు. కార్గిల్ యుద్ధంలో అసువులు బాసిన అమరజవాన్ల ఫోటోలను ప్రదర్శించారు. ఆపరేషన్ సిందూర్‌లో సైనికుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా హేమంత్‌కుమార్ మాట్లాడుతూ, విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకోవాలని, దేశం మనకేం చేసిందని అనుకోకుండా, మనం దేశం కోసం ఏంచేయాలో ఆలోచించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ జనరల్ మేనేజర్ రామమూర్తినాయుడు, జూనియర్ మేనేజర్ అజయ్‌సింగ్, ప్రిన్సిపాల్స్ మణిమాల, జ్యోతి, జాసిమన్, నాగేంద్ర పాల్గొన్నారు.

## బంగారు కుటుంబాలను గుర్తించండి

జిల్లా వైద్యఆరోగ్యశాఖలోని వైద్యులు, సిబ్బంది అందరూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ-4 పథకాన్ని అవగాహన చేసుకుని, పేదరిక నిర్మూలన కోసం బంగారు కుటుంబాలను గుర్తించాలని, వారికి వైద్య సేవల్లో ప్రాధాన్యత ఇవ్వాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ డా. సుజాత చెప్పారు. పీ-4 కార్యక్రమంలో భాగంగా నిరుపేదలైన రోగులకు వైద్యసేవలందించేందుకు ముందుకు రావాలని, వీలైతే బంగారు కుటుంబాలను దత్తత తీసుకుని, వారి అభ్యున్నతికి కృషిచేయాలని సిబ్బందికి సూచించారు.

# నెల్లూరు కబుర్లు

## శాంతించిన పారిశుద్ధ్య కార్మికులు

### శ్రీధర్‌రెడ్డి చొరవతో..సమ్మె విరమణ



తమ పనులను కాంట్రాక్ట్ కార్మికులకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ గత రెండు వారాలుగా సమ్మెలో ఉన్న నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని పారిశుద్ధ్య కార్మికులు ఎట్టకేలకు జులై 29న సమ్మె విరమించారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చొరవ తీసుకుని, వారి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని హామీ ఇవ్వడంతో, కార్మికులు విధులకు హాజరయ్యేందుకు సిద్ధమయ్యారు. మంగళవారం నాడు కార్పొరేషన్ కమిషనర్‌తో కార్మికుల చర్చలు విఫలం కావడంతో, ఆ సంగతి తెలుసుకున్న శ్రీధర్‌రెడ్డి, అదేరోజు సాయంత్రం కమిషనర్ నందన్‌తో కలిసి కార్మికుల సంఘం నాయకులతో సమావేశమై వారి సమస్యలు తెలుసుకున్నారు. పురపాలక మంత్రి నారాయణ దృష్టికి ఆ సమస్యలన్నీ తీసుకువచ్చి న్యాయం చేస్తామని, కార్మికుల ప్రయోజనాలకు భిన్నంగా ఎలాంటి చర్యలు తీసుకునేది ఉండదని ఆయన హామీ ఇవ్వడంతో కార్మికులు శాంతించారు. టెండర్ల రద్దుకు సంబంధించి నాయకుల నుంచి సానుకూల పరిస్థితి కనిపించడంతో వారు సమ్మె మాని, బుధవారం నుంచి విధులకు హాజరయ్యేందుకు సిద్ధమయ్యారు. ఈ సమావేశంలో కార్మికసంఘం నాయకులు మూలం రమేష్, మాదాల వెంకటేశ్వర్లు, కత్తి శ్రీనివాసులు, కె. పెంచలనరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ రాజరాజేశ్వరిదేవి ఆలయంలో విశేష పూజలు



నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో జరుగుతున్న మహాకుంభాభిషేక కార్యక్రమాల్లో భాగంగా, రెండవరోజైన మంగళవారం నాడు కంచిపీఠం ఆస్థాన సిద్ధాంతి బ్రహ్మశ్రీ ఎల్.విజయ సుబ్రహ్మణ్య సిద్ధాంతి నేతృత్వంలో అమ్మవారికి పూజా కార్యక్రమాలు కన్నులపండువగా జరిగాయి. కంచికామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామివారి దివ్యాశీస్సులతో జరుగుతున్న ఈ పూజల్లో దాతలు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ జీర్ణోద్ధరణ, విమాన గోపురం పునర్నిర్మాణ దాతలు ఆల్తూరు సులోచనమ్మ, నవగ్రహ మండపం దాతలు పసుపులేటి నరసింహారావు పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి, సహాయ కమిషనర్ కోవూరు జనార్ధన్‌రెడ్డి, ప్రధాన అర్చకులు ఎస్.రఘు రామమూర్తి, వేదపండితుల పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు జరిగాయి.



## బీద రవిచంద్రకు సన్మానం

తెలుగుదేశం పార్టీ యువనేత, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర ఇటీవల బీసీ కమిటీ ఛైర్మన్‌గా, శాసనమండలి సభా నియమాల కమిటీ సభ్యునిగా ఎన్నిక కావడం పట్ల స్థానిక నేతల్లో సంతోషం వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా జులై 29న నెల్లూరులోని ఆయన నివాసంలో జిల్లా బీసీ సంక్షేమ సంఘం నాయకులు బీద రవిచంద్రను కలిసి అభినందించి సన్మానించారు. బీసీ నాయకులు ఎస్.శ్రీనివాసులు, విరవు లలితారామ్, మాజీ కార్పొరేటర్ ఓంప్రకాష్‌యాదవ్, ఎస్ఎస్ యాదవ్, ఎం.ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

## వేడుకగా నాగపంచమి



నాగపంచమి పర్వదినం సందర్భంగా జులై 29న జిల్లా వ్యాప్తంగా ప్రజలు, ముఖ్యంగా మహిళలు నాగుల పుట్టలకు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. నెల్లూరు నగరంలో అనేకప్రాంతాల్లో ఉన్న నాగుల పుట్టల వద్ద మహిళలు పూజలు చేసుకున్నారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయాలను సందర్శించుకున్నారు. నాగదేవతల పూజలతో సకలదోష నివారణ కలుగుతుందని భావిస్తూ, నాగశిలలను పాలతో అభిషేకించి హారతులిచ్చారు. నగరవాసులే కాక, ఇతర ప్రాంతాల నుంచి కూడా నెల్లూరు రూరల్‌లోని కనుపర్తిపాడులో ఉన్న ప్రసిద్ధ సుబ్రహ్మణ్యస్వామి దేవాలయానికి భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

## బాధ్యతలను నిజాయితీగా నిర్వహించాలి

**- విద్యుత్ ఎస్ఇ విజయన్**



విద్యుత్ ఉద్యోగులు, సిబ్బంది తమ బాధ్యతలను నిజాయితీగా నిర్వహించాలని జిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఇ విజయన్ సూచించారు. జులై 29న ఆయన నెల్లూరులోని ఆటోనగర్‌లో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. ఫ్యూజ్ ఆఫ్ కాల్స్‌కు సకాలంలో స్పందిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. రికార్డుల నిర్వహణలో పారదర్శకంగా ఉండాలని, నిబద్ధతతో విధులు నిర్వహించాలని సిబ్బందికి చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఏఇ శ్రీధర్, డీఇ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా విజయ్ దివస్




నెల్లూరులోని 10-ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సిసి లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ గొందగవే ఆదేశాల మేరకు ఇటీవల స్థానిక వెంగళరావునగర్‌లోని మునిసిపల్ హైస్కూల్‌లో ఎన్‌సిసి సెకండ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న గుండాల నరేంద్రబాబు ఆధ్వర్యంలో ఘనంగా విజయ్ దివస్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నరేంద్రబాబు మాట్లాడుతూ, కార్గిల్ యుద్ధంలో భారత సైన్యం ఘనవిజయం సాధించినందుకు గుర్తుగా ప్రతి సంవత్సరం జూలై 26న దేశవ్యాప్తంగా విజయ్ దివస్ నిర్వహిస్తారన్నారు. అనంతరం, కార్గిల్ యుద్ధంలో అమరులైన భారత అమరవీరులకు కొవ్వొత్తులు వెలిగించి ఎన్‌సిసి క్యాడెట్లు నివాళులర్పించారు. స్థానిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం కూడలి నుంచి కలెక్టర్ ప్రాంగణంలోని తిక్కన భవనం వరకు ర్యాలీని నిర్వహించారు. ఎన్‌సిసి అధికారులు సివి నాగరాజు, సబ్ లెఫ్టినెంట్ ప్రసాద్, జిల్లా సైనిక సంక్షేమ అధికారి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.






## ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ సమావేశం



నెల్లూరులోని ఆచారివీధిలో ఉన్న క్లాత్‌మర్చంట్స్ అసోసియేషన్ హాలులో ఇటీవల ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సమావేశం జరిగింది. ఆ సంఘం అధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో నెల్లూరు అర్బన్ తహశీల్దార్ షఫీని ఘనంగా సన్మానించారు. సంఘం కార్యదర్శి చుండూరు కృష్ణమూర్తి, కోశాధికారి అద్దేపల్లి సుబ్బారావు, కృష్ణయ్య, ఆడిటర్ సత్యనారాయణగుప్తా, అనుమాలశెట్టి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# వాగ్దానాలను నెరవేరుస్తూ.. సుపరిపాలన!

## ➤ రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం



తమ కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన వాగ్దానాలను నెరవేరుస్తూ, ప్రజల ఆకాంక్షలకు తగ్గట్టుగా సుపరిపాలన అందిస్తోందని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. జులై 28న ఆయన ఆత్మకూరు నియోజకవవర్గం లోని తూర్పుకంభంపాడులో రూ. 3 కోట్ల విలువైన అభివృద్ధిపనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. తొలుత, కోటితీర్థంలోని ప్రసిద్ధ త్రికోటేశ్వరస్వామి శివాలయాన్ని దర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం, తూర్పుకంభం పాడులో రూ. 22.50లక్షలతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనం, ప్రహరీగోడ నిర్మాణాన్ని ప్రారంభించారు. రూ. 50లక్షలతో నీలకంఠేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి, రూ. కోటి 95 లక్షలతో నిర్మించిన సిమెంటురోడ్లను ప్రారంభించారు. రూ. 25లక్షలతో జల్ జీవన్ మిషన్ పథకం పనులకు శంకుస్థాపన చేసి, తూర్పుకంభంపాడులో 'సుపరిపాలన తొలిఅడుగు' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్ళి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తన కార్యదక్షత, అపార అనుభవంతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తున్నారని కొనియాడారు. ఇచ్చిన హామీ మేరకు పింఛను పెంచి పేదల కళ్ళల్లో ఆనందం నింపారని, ఉచితంగా గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నారని, ఒక కుటుంబంలో ఎంతమంది పిల్లలుంటే వారందరి బాగు కోసం 'తల్లికి వందనం' పథకం ద్వారా నిధులందిస్తున్నారని తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు రూ. 20 వేలు ఇవ్వనున్నామని, ఈ నేపథ్యంలో ప్రతి ఇంటికీ వెళ్లి ఈ ఏడాదిలో తమ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి వారి ఆశీస్సులు అందుకుంటున్నామన్నారు.

# శ్రీసిటీలో..తైవాన్ బృందం




రాష్ట్రంలో పెట్టుబడి అవకాశాల పరిశీలనలో భాగంగా తైవాన్ దేశానికి చెందిన 14 మంది వ్యాపార ప్రతినిధుల బృందం ఇటీవల శ్రీసిటీని సందర్శించింది. ప్రపంచ ప్రసిద్దిగాంచిన బ్రాండెడ్ అథ్లెటిక్, క్యాజువల్ ఫుట్‌వేర్ తయారీదారు పౌచెన్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మాక్సలిన్ నేతృత్వంలో వచ్చిన ఆ బృందానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, శ్రీసిటీ తరఫున సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్) ఆర్.శివశంకర్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా, పారిశ్రామిక పెట్టుబడులకు ప్రధాన గమ్యస్థానంగా శ్రీసిటీ ప్రత్యేకతలను వివరిస్తూ శివశంకర్ సమగ్ర ప్రజెంటేషన్ ఇచ్చారు. శ్రీసిటీ వ్యూహాత్మక స్థానం, వివిధ రంగాల పరిశ్రమలు, అత్యుత్తమ సామాజిక మౌళిక సదుపాయాలు, రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల పారిశ్రామిక అనుకూల విధానాలను ఆయన వారికి వివరంగా తెలియజేశారు. తైవాన్‌కు చెందిన రెచి ప్రెసిషన్ సంస్థ శ్రీసిటీలో డైకిన్ పరిశ్రమతో కలిసి ప్లాంట్ ఏర్పాటు చేయడాన్ని వారి దృష్టికి తెచ్చారు. ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్మెంట్ బోర్డు అధికారులు వికాస్ మర్మత్, రంజిత్, గీతాంజలి, ఇన్వెస్ట్ ఇండియా ప్రతినిధి మనీష్ ప్రతినిధితో పాటు వర్చువల్‌గా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరిశ్రమలు మరియు వాణిజ్య శాఖ కార్యదర్శి డాక్టర్ ఎన్.యువరాజ్ బృందంతో ప్రత్యేక చర్చలు జరిపారు. ఈ చర్చల్లో శ్రీసిటీ–కుప్పం కారిడార్‌లో వ్యాపార సౌలభ్యం, పారిశ్రామిక ప్రోత్సాహకాలు ఇతర ప్రయోజనాలను ప్రస్తావించారు. సమర్థ నాయకత్వంలో రాష్ట్రంలోని పారిశ్రామిక అనుకూల వాతావరణాన్ని, శ్రీసిటీ మౌళిక సదుపాయాలను, సమగ్ర అభివృద్ధిని మాక్సలిన్ కొనియాడారు.

# మాట నిలబెట్టుకుంటున్న ప్రభుత్వం

## ➤ మంత్రి కొల్లు రవీంద్ర



రాష్ట్రం వేలాదికోట్ల రూపాయల ఆర్థిక లోటుతో ఇబ్బందులు పడుతున్నప్పటికీ ప్రజలకు అవసరమైన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి కొరత లేకుండా ప్రభుత్వం సుపరిపాలన సాగిస్తోందని రాష్ట్ర గనులు, భూగర్భ మరియు ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర చెప్పారు. జులై 29న ఆయన కావలి నియోజకవర్గంలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. తొలుత పట్టపుపాళెం వద్ద అంతర్గత సీసీ రోడ్లకు శంకుస్థాపన చేసి, తుమ్మలపెంట పల్లిపాలెం వద్ద 44 లక్షల రూపాయల వ్యయంతో జలజీవన్ మిషన్ కింద త్రాగునీటి వసతికి మరియు రూ. 27.4 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా ఒట్టూరు వద్ద రూ.25 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణానికి, రూ. 55 లక్షల వ్యయంతో రక్షిత మంచినీటి పథకానికి శాసనమండలి సభ్యులు బీద రవిచంద్ర, కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట కృష్ణారెడ్డిలతో కలిసి శంకుస్థాపనలు చేశారు. అనంతరం, మంత్రి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు టీడీపీ ఇచ్చిన హామీల అమలుకు ప్రాధాన్యతనిస్తూ, ఇప్పటికే 95 శాతం హామీలను నెరవేర్చడం జరిగిందన్నారు. శాసనమండలి సభ్యులు బీద రవిచంద్ర మాట్లాడుతూ, మత్స్యకారుల సమస్యలు తెలిసిన వ్యక్తి మంత్రి కొల్లు రవీంద్ర అని కొనియాడారు. తమ ప్రభుత్వ హయాంలో మోడల్ స్కూల్ ఏర్పాటు చేయడంతో పాటు అత్యధిక నిధులతో సీసీ రోడ్లు కూడా ఏర్పాటు చేయడం జరిగిందని ప్రభుత్వం కాపుల అభ్యున్నతికి మత్స్యకారుల అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందుతున్నాయా లేదా తెలుసుకొని పథకాలు అందని వారికి అందే విధంగా చేసే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి తెలిపారు. మార్కెటింగ్ కమిటీ చైర్మన్ అలేఖ్య పాల్గొన్నారు.

## చెన్నై-సూళ్లూరుపేట ఇఎంయు రైళ్ళ సేవలను

# నాయుడుపేట వరకు పొడిగించండి

## కేంద్రమంత్రికి ఎంపీ వేమిరెడ్డి వినతి



ప్రస్తుతం చెన్నై - సూళ్లూరు పేట మధ్య నడుస్తున్న ఇఎంయు రైల్ సేవలను నాయుడుపేట వరకు పొడిగించాలని నెల్లూరు పార్లమెంట్‌సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్) కేంద్ర రైల్వే సహాయమంత్రి సోమన్నకి విజ్ఞప్తి చేశారు. ఇటీవల ఆయన ఢిల్లీలోని కేంద్ర మంత్రి కార్యాలయంలో సోమన్నను కలసి, నాయుడుపేటలోని సదరన్ రైల్వే ప్యాసింజర్స్ సంక్షేమ సంఘం వారు ఇచ్చిన వినతి పత్రాన్ని అందించారు. నాయుడుపేటతో సహా తిరుపతిజిల్లాలోని చుట్టుపక్కల మండలాలు, గ్రామాల నివాసితులు, ఉద్యోగులు, వ్యాపారులు, మరియు సాధారణ ప్రజల విజ్ఞప్తి మేరకు చెన్నై-సూళ్లూరుపేట మధ్య నడుస్తున్న ఇఎంయు రైలు సేవలను నాయుడుపేట వరకు పొడిగించాలని ఆయన కోరారు. నాయుడుపేట ప్రాంతం పారిశ్రామికంగా బాగా అభివృద్ధి చెందుతోందని, దాంతో కార్మికులు, విద్యార్థులు, సాధారణ ప్రజల రోజువారీ ప్రయాణ అవసరాలు పెరిగాయని ఆయన కేంద్రమంత్రికి వివరించారు. ముఖ్యంగా చెన్నైకి ప్రయాణించే వారి సంఖ్య పెరుగుతోందని తెలిపారు. ప్రస్తుతం, చెన్నై మరియు సూళ్లూరుపేట మధ్య 11 ఎలక్ట్రిక్ మల్టిపుల్ యూనిట్(ఇఎంయు) రైళ్లు నడుస్తున్నాయన్నారు. నాయుడుపేటకు 20కి.మీ దూరంలో సూళ్లూరుపేట వరకే ఆ రైళ్ళ సేవలు ఆగిపోతుండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, దాంతో విధిలేక ఇతర ప్రత్యామ్నాయ రవాణా మార్గాలపై ఆధారపడాల్సి వస్తోందని చెప్పారు. ఇఎంయు సేవలను నాయుడుపేట వరకు పొడిగించడం వల్ల చుట్టుపక్కల మండలాలు, గ్రామాల నుండి 5 లక్షల మంది జనాభాకు ప్రయోజనం చేకూరుతుందని ఆయన చెప్పారు. ఈ పొడిగింపు చెన్నై–తిరుపతి కారిడార్‌లో నాయుడుపేటకు పెరుగుతున్న డిమాండ్‌ను, వ్యూహాత్మక ప్రాముఖ్యతను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ఆ వినతిని పరిశీలించి వీలైనంత త్వరగా చర్యలు తీసుకోవాలని వేమిరెడ్డి కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు.

# ప్రశాంతమ్మకి సముచిత స్థానం!



## మహిళా, శిశుసంక్షేమశాఖ కమిటీ సభ్యురాలిగా నియామకం

కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి అసెంబ్లీ కమిటీల్లో సముచిత స్థానం దక్కింది. ఆంధ్రప్రదేశ్ శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, శాసనమండలి ఛైర్మెన్ కొయ్యే మోషేనురాజు ఆంధ్రప్రదేశ్ శాసనసభ, శాసనమండలి సభ్యులతో 2025–26 సంవత్సరానికి ఇటీవల ఉభయసభల సంయుక్త కమిటీలు ఏర్పాటు చేశారు. ఈ కమిటీలలో మహిళా శిశు సంక్షేమం, వికలాంగులు మరియు వయోవృద్ధుల సంక్షేమ కమిటీ సభ్యురాలిగా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నియమితులయ్యారు. ఈ కమిటీ మహిళ శిశు సంక్షేమం, వయోవృద్ధులకు సంబంధించి వివిధ అంశాలను పర్యవేక్షించి, తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ఈ కమిటీలో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి నియమితురాలు కావడంపై జిల్లావ్యాప్తంగా ప్రజలు, కూటమి నాయకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



## చిన్మయా విద్యార్థుల
# భగవద్గీత పారాయణం



శ్రీసిటీలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఇటీవల స్థానిక చిన్మయ విద్యాలయ విద్యార్థులు ఆలపించిన భగవద్గీత పారాయణం ఎంతగానో ఆకట్టుకుంది. శ్రీసిటీ ఆధ్యాత్మిక సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ఈ కార్యక్రమంలో 15 మంది విద్యార్థులు పాల్గొని భగవద్గీతను భక్తిశ్రద్ధలతో పారాయణం చేశారు. చిన్మయ మిషన్ 75 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో భాగమైనట్లు చిన్మయ ఉపాధ్యాయులు పి.రామచంద్రన్, వి.సంధ్యారెడ్డి తెలిపారు. శ్రీవాణి నిర్వాహకులు విద్యార్థులకు ప్రత్యేక బహుమతులతో పాటు స్వామివారి తీర్థ, అన్న ప్రసాదాలను అందచేశారు. శ్రీసిటీ ప్రతినిధులు మధురెడ్డి, పి.బి.ఎస్.శాస్త్రి, పల్లేటి బాలాజీ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## గుండె తపస్సు

**ఆమె –**
నిద్రలేని తెల్లారని వేకువ
కళ్ళు చింతనిప్పుల్ని చేసి
సూర్యోదయాల్ని సృష్టించగల ప్రతిభ ఆమె సొంతం
కంటి డ్రోన్లతో అవకాశాల రేణువుల్ని
పట్టి ముందు కడగేయగల నేర్పరి
పుట్టిన నాటి నుంచి అందమైన కలల్ని
రాల్చుకొన్న ఆమె
గుండెల్లో ఆవేదనల చిగుళ్ళకు లేపనా
లద్ది జోకొడుతూ ఉంది.
ఆమెకు ఆత్మవిశ్వాసమే
ఆయుధమై తెరచాపలా నిల్చింది.
ఆకాశం క్షిపణుల్ని మోసినట్లు
ఆమె చీకట్లను మోస్తుంది.
వెలుగు కోసం కళ్ళ టార్చ్‌లైట్లతో
పూలసజ్జతో ధనుర్ధారియై
అజేయంగా సైకిల్ వాహనమెక్కి
కదనరంగానికి బయల్దేరింది
వేయి బాహువుల బలంతో
తానో పూలపరిమళమై
వేకువను చీల్చుకొని
ఆమె వడివడిగా అడుగులేస్తున్నది.
తనువును ధనువుగా మలచి
జనంపైకి పూలసజ్జ విసిరింది.
దేవుళ్ళకు సజ్జల్లో పళ్ళు తీసుకెళ్ళే
తల్లుల్ని పూలతో పరిమళం కావించమని
వేడుకొంది.
దేవాలయంలోకి ప్రాతఃకాలంలోనే
క్యూకట్టిన భక్తుల్లోకి పూలపరిమళమై
ప్రవహించింది.
ఆమె కన్నీరు రాలినచోట నదులు
ప్రవహించి పంటల వాగులు
ఉప్పొంగుతాయి.
ఓ పిట్టలేస్తే అన్ని పిట్టలూ
బారులు తీరినట్లు
ఓ తల్లి పూల కోసం వాకబు చేస్తే
అందరు తల్లుల నుంచి అదే
ప్రతిస్పందన ధ్వనించింది.
ఆమె జయించింది.
ఆమె మేనేజ్‌మెంట్ సిద్ధాంతాన్ని
అవలీలగా ఒడిసిపట్టుకొంది
అది ఆమె గుండె తపస్సు
పట్టుదల పరమార్థమైన హవిస్సు
క్షణక్షణం తన నాదంతో
పూలతల్లి పరిమళించింది!



**చిన్ని నారాయణరావు**
9440202942

# మంచి బేరమే!

మనసులో మాట 56

రెండు మూడు ఇరుగు పొరుగు దేశాలు గిల్లి కజ్జాలతో చీటికి మాటికి చికాకు పెడుతున్న వేళ.. ఇటీవల భారత ప్రధాని మోదీ రెండు దేశాల పర్యటనలు ఆసక్తిని కలిగించాయి. అంతే కాదు.. ఆ పర్యటనలు మంచి ఫలితాలనిచ్చాయి. ప్రధాని మోదీ ఇటీవల చేసిన యూకే పర్యటన, మాల్దీవుల పర్యటన ఆర్థికంగా, వ్యూహాత్మకంగా భారత్‌కు గొప్ప విజయంగా చెప్పవచ్చు. మోదీ జులై 23నుంచి 26 వరకు యూకే, మాల్దీవుల్లో పర్యటించారు.

మోదీ 2018 తర్వాత తొలిసారి చేపట్టిన యూకే పర్యటనలో అత్యంత ముఖ్యమైన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేసుకొచ్చారు. యూకే ప్రధాని కీర్ స్టార్మర్‌తో మోదీకి ఇది తొలి అధికారిక సమావేశం కావడం విశేషం. లేబర్ పార్టీ పదేళ్ల విరామం తర్వాత అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో రెండు దేశాల మధ్య వాణిజ్య పరంగా ఇది గొప్ప ముందడుగుగా చెప్పవచ్చు. ఈ రెండు పర్యటనలు ఒక చక్కటి ప్రణాళిక ప్రకారం చోటు చేసుకున్నాయి. ఒకటి: జీ7 దేశమైన బ్రిటన్‌తో పరస్పర ఆర్థిక సంబంధాలను మరింత బలపరచడం. రెండోది: మన పరిసరాల్లో పోగొట్టుకున్న వ్యూహాత్మక ప్రాధాన్యతను తిరిగి పొందడం. పశ్చిమ దేశాలతో ఆర్థిక అనుబంధాన్ని బలపరచడం, దక్షిణాసియాలో చైనా ప్రభావాన్ని అదుపులో పెట్టడం ద్వారా మన సార్వభౌమత్వాన్ని మరింత బలోపేతం చేసుకోవడం అనే భారత దేశ లక్ష్యాల సాధనకు ఈ పర్యటనలు బలంగా దోహదం చేయనున్నాయి.

మాల్దీవుల్లో మొహమ్మద్ ముయిజ్జు అధికారంలోకి వచ్చిన తర్వాత చైనాకు అనుకూలంగా వ్యవహరిస్తూ భారత్‌కు చికాకులు కలిగించిన సంగతి తెలిసిందే. "ఇండియా అవుట్" ఉద్యమం ప్రారంభించి, భారత రక్షణ సిబ్బందిని మాల్దీవుల నుంచి పంపించేసేదాకా నిద్రపోలేదు. కానీ త్వరలోనే ఆయనకు తత్వం బోధపడింది. చైనా కన్నా భారత్ అత్యంత విశ్వసనీయమైన భాగస్వామి అని అర్థమై, ఇప్పుడు భారత్ స్నేహహస్తం కోసం చేతులు చాచారు. ఈ నేపథ్యంలో మాల్దీవుల పర్యటనకు వెళ్లిన మోదీ ఆ ద్వీప దేశానికి అవసరమైన రుణ సాయం ప్రకటించారు. ఈ పర్యటన ద్వారా ఈ ప్రాంతంలో వ్యూహాత్మక ప్రాంతమైన మాల్దీవుల్లో మళ్లీ మన పట్టును నిలబెట్టుకున్నట్లయింది.

మరోవైపు యూకేతో కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాల్లో విప్లవాత్మకమైన మార్పునకు నాంది పలకనుంది. ఐరోపా సమాఖ్య నుంచి బ్రిటన్ బయటకు వచ్చేసిన తర్వాత ఆ దేశం అంతర్జాతీయంగా బలమైన, విశ్వసనీయమైన వాణిజ్య భాగస్వామి కోసం చూస్తోంది. ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిన భారత్‌కు మించిన గొప్ప వాణిజ్య భాగస్వామి బ్రిటన్ కు దొరకదు. మరోవైపు రోజుకో మాట మారుస్తూ సుంకాలు పెంచుతానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బెదిరిస్తున్న వేళ భారత్‌కు బ్రిటన్‌తో సరికొత్త వాణిజ్య ఒప్పందం కుదరడం ప్రయోజనకరమే. ఇది భారత్–జీ7 దేశం మధ్య తొలిసారిగా కుదిరిన సమగ్ర ద్వైపాక్షిక ఒప్పందం కావడం వల్ల, ఐరోపా, అమెరికా, ఇతర అభివృద్ధి చెందిన దేశాలతో జరగబోయే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలకు ఇది ప్రమాణంగా మారుతుంది. మనకు ప్రయోజనం చేకూర్చుకునేలా బేరసారాలు చేయడానికి దోహదం చేస్తుంది. ఈ ఒప్పందం ద్వారా భారత ఎగుమతుల్లో ఏటా కనీసం ఐదు బిలియన్ల డాలర్ల వృద్ధి ఆశించవచ్చు. ఇది భారత (చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థలకు ప్రత్యక్ష ప్రయోజనం కలిగిస్తుంది. దాదాపు 99శాతం ఉత్పత్తులను భారత్... అతి తక్కువ పన్ను లేదా పన్ను లేకుండానే బ్రిటన్‌కు ఎగుమతి చేసే వీలు కలగనుంది. భారతీయ సంస్థలు, ఉద్యోగులు యూకేలో పని చేయడానికి మరింత అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయి. ఐటీ, ఫైనాన్స్, ఆర్కిటెక్చర్, విద్య వంటి సేవా రంగాలలో పనిచేసే భారత వృత్తి నిపుణులకు బ్రిటన్ మార్కెట్‌లో మరింత అవకాశాలు లభిస్తాయి. మూడు సంవత్సరాల పాటు డ్యూయల్ సోషియల్ సెక్యూరిటీ చెల్లింపుల నుంచి మినహాయింపు లభిస్తుంది. అత్యంత ముఖ్యంగా, మోదీ–స్టార్మర్ భేటీ రాజకీయ సంబంధాలను కొత్త దిశలో తీసుకువెళ్లే అవకాశముంది. గతంలో లేబర్ పార్టీ కశ్మీర్, భారత అంతర్గత విషయాలపై విమర్శలు చేస్తూ, భారత్‌తో సరైన రీతిలో సంబంధాలు నెరిపేది కాదు. కానీ స్టార్మర్ నేతృత్వంలో ఆ విధానం మారే అవకాశం ఉంది.

యూకేకి ఈ ఒప్పందం ద్వారా ప్రీమియం ఉత్పత్తులపై భారీ టారిఫ్ తగ్గింపులు లభిస్తాయి. ఉదాహరణకు, స్కాచ్ విస్కీపై ప్రస్తుతం ఉన్న 150 శాతం సుంకాన్ని 75 శాతం నుంచి 40 శాతం వరకు తగ్గించనున్నారు. స్కాచ్ ఉత్పత్తిని ఎక్కువగా చేసే యూకేకు వాణిజ్యపరంగా ఇది మేలు చేకూర్చేదే. బ్రిటిష్ వాహనాలు, ఆహార పదార్థాలు, వైద్య ఉపకరణాలకు కూడా ప్రయోజనం కలిగిస్తుంది. బ్రెగ్జిట్ అనంతరం ఆర్థికంగా ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న యూకేకు ఈ స్వేచ్ఛా వాణిజ్యం ఉపశమనం కలిగిస్తుంది.

వ్యవసాయం వంటి సున్నితమైన రంగాలను రక్షించుకుంటూనే, విస్తృత మార్కెట్ సరళీకరణను సాధించగలగడం ద్వారా భారతదేశం "నిబంధనలు అనుసరించేవారి" స్థానం నుంచి "నిబంధనలు నిర్ణయించేవారి" స్థానానికి మారినట్లయింది. బ్రిటన్ గతంలో వాణిజ్యాన్ని ఒక దోపిడీ సాధనంగా వాడింది. ముఖ్యంగా తన వలసపాలనతో వాణిజ్య పరంగా భారత దేశాన్ని దోచి వేసింది. కానీ ఇప్పుడు అదే బ్రిటన్‌తో భారతదేశం తన నియమాల ప్రకారమే ఒప్పందం కుదుర్చుకుంది. కాలం దేనికైనా సమాధానం చెబుతుంది. ఓడలు బండ్లవుతాయి. బండ్లు ఓడలవుతాయి మరి!...



**తుమ్మల బాల గంగాధర్ తిలక్**




## స్మార్ట్‌మీటర్లపై..సీపీఎం నిరసన

స్మార్ట్‌మీటర్లు వద్దనే వద్దని, వాటివల్ల వినియోగదారులకు అధికభారం పడుతుందని సీపీఎం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈనెల జులై 27న పలుచోట్ల ఆందోళనలు నిర్వహించారు. తోట పల్లిగూడూరు మండలంలోని ఇస్కపాళెంలో ఆ పార్టీ కార్యదర్శి బండి శౌరి ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన జరిగింది. స్మార్ట్‌మీటర్లకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, స్థానిక ఇస్కపాళెం కూడలిలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. సీపీఎం జిల్లా నాయకులు మూలం రమేష్, దుగ్గిరాల అన్నపూర్ణమ్మతో పాటు స్థానిక నాయకులు ఈపూరు లక్ష్మయ్య, బండి శౌరి, మోచెర్ల రాధయ్య, కొండయ్య, వీరయ్య, సీఐటీయు కార్యదర్శి మారుబోయిన రాజా తదితరులు పాల్గొన్నారు.

**కోవూరులో :**

స్మార్ట్‌మీటర్లు వద్దని, వ్యవసాయ మోటార్లకు వీటిని బిగించడం వల్ల రైతులకు అన్యాయం జరుగుతుందని కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి తుళ్ళూరు గోపాల్ అన్నారు. కోవూరులో జులై 27న జరిగిన కౌలురైతుల సంఘం మహాసభలో ఆయన మాట్లాడుతూ, స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చేస్తే పగలకొట్టండి అంటూ గత ప్రభుత్వ హయాంలో విమర్శించిన కూటమి నాయకులు, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నారని, ఇదెక్కడి న్యాయమని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం ఇకనైనా వినియోగదారుల కష్టాలను గుర్తించి స్మార్ట్‌మీటర్లను రద్దుచేయాలని కోరారు.

**నార్తురాజుపాళెంలో :**

కొడవలూరు మండలం నార్తురాజుపాళెంలో జరిగిన ఆ పార్టీ మండల మహాసభలో సీపీఎం నాయకుడు మూలం రమేష్ మాట్లాడుతూ, స్మార్ట్‌మీటర్ల వల్ల కరెంటుబిల్లుల మొత్తాలు అధికంగా వస్తున్నాయని, ప్రభుత్వం వెంటనే వాటిని నిలుపుదలచేయాలని కోరారు.

## వడ్డెర వృత్తిదారుల ప్రదర్శన

తమకు సామాజిక భద్రత లేదని, తమ కులస్తులపై అన్యాయాలు, అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తూ జులై 27న నెల్లూరులో ఆ సంఘం రాష్ట్ర నాయకుల ఆధ్వర్యంలో వీఆర్‌సి కూడలి నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు ప్రదర్శన నిర్వహించారు. తమకు రక్షణ కల్పించాలంటూ వడ్డెర వృత్తిదారులు పెద్దపెట్టున నినాదాలు చేశారు. అనంతరం స్థానిక ఏనుగ సుందరరామిరెడ్డి ఆడిటోరియంలో జరిగిన సంఘం మహాసభలో, ఏపీ వడ్డెర వృత్తిదారుల సంఘం కన్వీనర్ దయాకర్ మాట్లాడుతూ, వడ్డెర మహిళలపై ఇటీవలి కాలంలో అఘాయిత్యాలు ఎక్కువవుతున్నాయంటూ ఆందోళన వ్యక్తం చేశారు. వడ్డెరల భద్రతకు సామాజిక రక్షణ చట్టాన్ని అమలుచేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సంఘం రాష్ట్ర కన్వీనర్ భాస్కరయ్య మాట్లాడుతూ, వడ్డెరల సమస్యల సాధన కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. నాయకులు చల్లా వెంకటయ్య, భాస్కరయ్య, గుంజి నరసింహారావు, చిన్నయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## పొట్టేపాళెంలో సీపీఎం ధర్నాందోళన

నెల్లూరు రూరల్ మండలంలోని పొట్టేపాళెం కలుజుపై వంతెన నిర్మించాలని కోరుతూ జులై 27న సీపీఎం ఆధ్వర్యంలో ధర్నాందోళన జరిగింది. ఈ కలుజుపై వంతెన నిర్మించి వాహనదారులకు, ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని ఎంతోకాలం నుంచి కోరుతున్నా ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేకపోవడం విచారకరమని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మూలే వెంగయ్య, చంద్రమౌళి మాట్లాడుతూ, పొట్టేపాళెం, ములుముడి కలుజుల మీదుగా రోజూ వేలాదివాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయని, వేలాదిమంది ప్రజలు ఈ దారిమీదుగానే ప్రయాణిస్తుంటారని, వానలు, వరదలు వచ్చినప్పుడు కలుజు నీటిప్రవాహంతో ఉండి రాకపోకాలు నిలచిపోతుంటాయని తెలిపారు. ఎంతోకాలంగా కలుజు నిర్మాణం అతీగతీ పట్టించుకోకపోవడం దారుణమన్నారు.

# రెవెన్యూ సమస్యలు తీర్చేందుకు కృషి!

## - టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి



9 రోజులపాటు ఏకధాటిగా నెల్లూరురూరల్‌లో 18 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి, సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నామని టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తెలిపారు. ఇటీవల ఆయన నెల్లూరురూరల్ నియోజకవర్గ పరిధిలోని దేవరపాలెం గ్రామంలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆదేశాల మేరకు రెవెన్యూ సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. రెవెన్యూ సమస్యలు లేని నియోజకవర్గంగా నెల్లూరు రూరల్ నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టీడీపీ నాయకులు ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, మండల పరిషత్ అధ్యక్షుడు విజయ్ కుమార్, నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కార్యాలయ మండల ఇంచార్జ్ వేమిరెడ్డి సురేందర్‌రెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## రూరల్‌లో ముమ్మరంగా అభివృద్ధి పనులు

రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో, నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో రూరల్ నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. తాజాగా ఇటీవల 23వ డివిజన్, బ్యాంక్ కాలనీలో రూ. 15లక్షల రూపాయల వ్యయంతో అభివృద్ధి పనులకు టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే 23వ డివిజన్ అభివృద్ధికి 4.80 కోట్ల రూపాయల నిధులు కేటాయించడం జరిగిందన్నారు. స్థానిక కార్పొరేటర్ దుద్దుగుంట శ్రీనివాసులురెడ్డి, కోక్లస్టర్ ఇంచార్జ్ రాఘవేంద్రరావు, 23వ డివిజన్ టిడిపి అధ్యక్షులు మేకల మధు, నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కార్యాలయ ఇన్‌చార్జి దాట్ల చక్రవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'ఉత్తమ పీఎం శ్రీ పాఠశాల'గా..

# కలిగిరి మోడల్ స్కూల్




కలిగిరి మండల కేంద్రంలోని మోడల్ హైస్కూల్ 'ఉత్తమ పీఎంశ్రీ పాఠశాల'గా ఎంపికైంది. ఇప్పటివరకు ఎంతోమందికి విద్యాబుద్ధులు నేర్పించి, జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన ఆ మోడల్ స్కూల్‌ను బెస్ట్ పిఎం శ్రీ స్కూల్ కింద మార్చడం పట్ల, ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ హర్షం వ్యక్తంచేస్తూ, ఆమేరకు శిలాఫలకాన్ని కూడా ఆవిష్కరించారు. జులై 29న కలిగిరి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కాకర్ల మాట్లాడుతూ, 'ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా' (పీఎం శ్రీ) పథకంలో భాగంగా, ఈ పథకం కింద ఏర్పాటు చేసిన పాఠశాలలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక సంస్థలు, కేంద్రీయ విద్యాలయ సంఘటన మరియు నవోదయ విద్యాలయ సమితి పర్యవేక్షణలో నిర్వహించడం జరుగుతుందన్నారు. దేశ వ్యాప్తంగా 14,500 స్కూళ్ళను ఆ విధంగా ఏర్పాటు చేశారన్నారు. ఆంధ్రప్రదేశ్ నుండి 623 పాఠశాలలో ఎంపికయ్యాయని, ఆ పాఠశాలల లక్ష్యం నాణ్యమైన విద్యను అందించడం. నూతన జాతీయ విద్యా విధానంతో పాటు, అన్ని వనరులను సమకూర్చడం, సురక్షితమైన మరియు ఉత్తేజపరిచే అభ్యాస వాతావరణాన్ని కలిగించడం వీటి లక్ష్యమన్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో మొత్తం నాలుగు మోడల్ స్కూల్స్ ఉండగా కలిగిరి మోడల్ స్కూల్ ఉత్తమ పిఎం శ్రీ పాఠశాలగా ఎంపిక కావడం అభినందనీయమన్నారు.

## ఎన్‌బికెఆర్‌లో..కార్గిల్ విజయ్ దివస్




కార్గిల్ యుద్ధంలో అమరులైన వీర జవాన్లను స్మరించుకుంటూ, ఆ అమర వీరులకు ఘనంగా నివాళులర్పించారు కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్టీలోని విద్యార్థులు. జులై 26న కార్గిల్ విజయ్ దివాస్‌ని పురస్కరించుకుని ఎన్‌బికెఆర్‌లోని ఎన్‌సిసి విభాగాలు, 10-ఏ నావెల్ ఎన్‌సిసి యూనిట్, 2-ఏ ఇఎంఇ ఎన్‌సిసి యూనిట్‌ల క్యాడెట్లు విద్యానగర్‌లోని గాంధీబొమ్మ కూడలి వరకు ర్యాలీ నిర్వహించి, అమరవీరుల త్యాగనిరతిని కొనియాడారు. దేశభక్తితో నినాదాలు చేశారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి పర్యవేక్షణలో ఎన్‌సిసి అధికారులు డా.వి.మల్లికార్జునరెడ్డి, డా.జి.మాధవయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్


# రైతులకు అండగా ఉండాలి

## ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్



గూడూరు 24 సొసైటీ నూతన పాలకవర్గం రైతులకు అండగా ఉంటూ, వారికి సకాలంలో రుణాలు మంజూరు చేసి కూటమి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్ తెలిపారు. గూడూరు పట్టణంలోని సొసైటీ కార్యాలయంలో జులై 28న నూతన పాలకవర్గం ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. అధ్యక్షులుగా అల్లూరు కరుణాకరరెడ్డి, డైరెక్టర్లుగా దువ్వూరు రవీంద్రరెడ్డి, బచ్చల రవీంద్రరెడ్డి ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చిల్లకూరు మండలానికి చెందిన రైతుకు డ్రోన్ యంత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, బిల్లు చెంచురామయ్య, కొండూరు వెంకటేశ్వర్లురాజు, రహీమ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.

## అబ్దుల్ కలాం సేవలు మరువలేనివి



మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవలు మరువలేనివని ఏడో అదనపు జిల్లా జడ్జి వెంకటనాగ పవన్ తెలిపారు. గూడూరు కోర్టు ప్రాంగణంలో అబ్దుల్‌కలాం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జులై 26వ తేదీ నివాళులర్పించారు. జడ్జి సులోచనరాణి, ట్రస్టు ఛైర్మెన్ తాజుద్దీన్, అరవ పార్వతయ్య పాల్గొన్నారు.

## సత్ప్రవర్తనతో నడుచుకోవాలి

### డీఎస్పీ డాక్టర్ గీతాకుమారి



శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా.. అలాంటి వారిపై చర్యలు తీసుకొంటామని గూడూరు డిఎస్పీ డాక్టర్ గీతాకుమారి తెలిపారు. గూడూరు పట్టణంలోని రూరల్ పోలీస్‌స్టేషన్ వద్ద జులై 27వ తేదీ రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ శేఖర్‌బాబు, ఎస్సైలు మనోజ్‌కుమార్, తిరుపతయ్య, సుబ్రహ్మణ్యం రాజు పాల్గొన్నారు.

## లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గం



గూడూరు పట్టణంలోని స్థానిక డి.ఆర్.డబ్ల్యు కళాశాలలో లైన్స్ క్లబ్ ఆఫ్ గూడూరు వైజేపీ, గూడూరు టౌన్ క్లబ్, గూడూరు వెస్ట్‌క్లబ్‌ల నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమం ఇటీవల ఘనంగా జరిగింది. కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్యఅతిథులకు లయన్స్‌క్లబ్ సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారి చేతులమీదుగా జ్యోతి ప్రజ్వలన, నూతన కార్యవర్గ అధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యుల ద్వారా ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం ముఖ్యఅతిథులను ఘనంగా సన్మానించారు. పీఎం జెఎఫ్ లయన్ ఎం.ఉపేంద్ర, లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఇ.గోపాల కృష్ణ, ఇన్‌స్టాలేషన్ ఆఫీసర్ ఫాస్ట్ డిస్టిక్ క్యాబినెట్ సెక్రటరీ బి.శ్రీనివాస్, పి.డి.జి. ఎం.గౌతమ్, డాక్టర్ ఎం.విరూపాక్షరెడ్డి, సెకండ్ వైస్ డిస్ట్రిక్ గవర్నర్ ఆర్‌వి రావు, పి.డి.జి వై.అమృతవల్లి, ఫాస్ట్ జోన్‌ఛైర్మెన్ గురునాథం తదితరులు పాల్గొన్నారు.




## సుందరంగా మోక్షధామం

గూడూరు రెండవ పట్టణంలోని రోటరీ మోక్షధామంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సంయుక్త సేవాసమితి అధ్యక్షులు సి.అశోక్ కుమార్ దాతృత్వంతో సుమారు రెండులక్షల రూపాయల వ్యయంతో మోక్షధామాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు వెంకటేశ్వర్లురెడ్డి మాట్లాడుతూ, రోటరీ క్లబ్ ద్వారా విరివిగా సేవా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మోక్షధామం అభివృద్ధికై సహకారాన్ని అందించిన సంయుక్త సేవాసమితికి అభినందనలు తెలియజేశారు. సంయుక్త సేవా సమితి అధ్యక్షులు సి.అశోక్ కుమార్‌ను రోటరీ సభ్యులు ఘనంగా సన్మానించారు. క్లబ్ కార్యదర్శి మల్లు విజయ్‌కుమార్‌రెడ్డి, మోక్షధామం ఛైర్మెన్ కిరణ్‌చక్రవర్తి, సీనియర్ రొటేరియన్స్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నోట్‌బుక్కుల పంపిణీ



గూడూరు రెండవ పట్టణంలోని ఇందిరానగర్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో జులై 26వ తేదీ ఎస్వీ రత్నం చారిటబుల్ ట్రస్ట్ అధినేత శ్రీకంటి రామమోహనరావు దాతృత్వంతో రోటరీ వెస్ట్‌క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్‌బుక్స్‌ను పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షులు దువ్వూరు విజయభాస్కర్‌రెడ్డి, కార్యదర్శి కందాటి రాఘవరెడ్డి, సీనియర్ రొటేరియన్ ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి బిల్లు చెంచురామయ్య, బండి ధనుంజయ రెడ్డి, హెచ్‌ఎం చెంచు కృష్ణయ్య, పాఠశాల కమిటీ ఛైర్మెన్ సురేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.




## చంద్రబాబు ప్రభుత్వ మోసాలను..

# ఇంటింటికీ వెళ్ళి చెప్పండి

### - - - పార్టీ శ్రేణులకు రామ్‌కుమార్‌రెడ్డి దిశానిర్దేశం - - -

ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న మోసాలను ఇంటింటికీ వెళ్ళి తెలియ జెప్పి, ప్రజలను చైతన్యపరచాలని వెంకటగిరి నియోజకవర్గ వైయస్సార్సీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఇటీవల ఆయన మండల కేంద్రమైన కలువాయిలో ఆ మండల పరిధిలోని వైయస్సార్సీపి శ్రేణులకు 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ", "రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, గత ఎన్నికల్లో చంద్రబాబు, పవన్ కల్యాణ్ సంయుక్తంగా బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారంటీ పేరిట ప్రమాణ పత్రాలు పంపిణీ చేశారన్నారు. సాధ్యం కాని హామీలిచ్చిన చంద్రబాబు రాష్ట్ర ప్రజలను మోసం చేశారని, అధికారం చేపట్టి 13 నెలలవుతున్నా, తూతూమంత్రంగా ఒక గ్యాస్ సిలిండర్, అరకొరగా తల్లికి వందనం మినహా ప్రజలకు చేసిందేమీ లేదని ఆయన విమర్శించారు.

## ఇస్రో శాస్త్రవేత్తలను అభినందించిన వేమిరెడ్డి దంపతులు

ఇస్రో నుంచి బుధవారం సాయంత్రం ప్రయోగించిన జీఎస్ఎల్వి ఎఫ్ 16 రాకెట్ ప్రయోగం విజయవంతం కావడం పట్ల నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఆయన సతీమణి..కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిలు ఒక ప్రకటనలో సంతోషం వ్యక్తం చేశారు. ఈ ప్రయోగ విజయం భారత అంతరిక్ష శాస్త్రవేత్తల ప్రతిభాపాటవాలకు నిదర్శనమని కొనియాడారు. అమెరికాలోని నాసా–మనదేశంలోని ఇస్రో కలిసిచేసిన ఈ ప్రయోగ విజయం హర్షదాయకమన్నారు. అంతరిక్షం నుంచి భూమిపై ఒక సెంటీమీటరు కంటే తక్కువ వైశాల్యాన్ని కూడా హైరిజల్యూషన్లో చిత్రాలు తీయగల నిసార్ ఉపగ్రహాన్ని ఈ రాకెట్ ద్వారా నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టడం ఒక అపూర్వ ప్రయోగమని, భూ పరిశీలనకు ఎంతగానో ఈ ఉపగ్రహం తోడ్పడుతుందని అన్నారు. ప్రకృతి వైపరీత్యాలతో పాటు దేశ సరిహద్దులో నిఘా వ్యవస్థను పర్యవేక్షించేందుకు ఈ ఉపగ్రహ సేవలు దోహదపడతాయన్నారు. ఇప్పటికే అంతరిక్ష ప్రయోగాలలో వరుస విజయాలతో అద్భుతాలు సాధిస్తున్న ఇస్రో శాస్త్రవేత్తలు అంతర్జాతీయ అంతరిక్ష పరిశోధన రంగంలో భారతదేశాన్ని అగ్రగామిగా నిలపగలరని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

## మహిళల క్యాన్సర్లపై..

# అపోలో ఆసుపత్రి ప్రత్యేక దృష్టి

### స్క్రీనింగ్ పరీక్షలు ప్రారంభం - డా. శ్రీరామ్‌సతీష్ వెల్లడి



మహిళలకు, ముఖ్యంగా 45 ఏళ్ళు దాటిన వారికి సోకే జన నేంద్రియ కేన్సర్లను ముందుగానే గుర్తించి వారికి సరైనచికిత్స అందించి, సంపూర్ణఆరోగ్యాన్ని ప్రసాదించే దుకు నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్‌లో "ఎండ్ – ఓ చెక్" పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఆసుపత్రి డైరెక్టర్–మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్ చెప్పారు. బుధవారం నెల్లూరు అపోలో ఆసుపత్రిలో జరిగిన కార్యక్రమంలో సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ జివివి ప్రసాద్‌రెడ్డి, ప్రముఖ అంకాలజిస్ట్ డాక్టర్ హరిత, యూనిట్ హెడ్ బాలరాజుతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, అండాశయ మరియు గర్భాశయ క్యాన్సర్లు మహిళలను ప్రభావితం చేసే మొదటి 5 క్యాన్సర్లలో ప్రధానమైనవని చెప్పారు. భారతదేశంలోని అన్ని అపోలో ఆసుపత్రులు మరియు అపోలో క్యాన్సర్ ఆసుపత్రుల్లో ఈ కార్యక్రమం ప్రారంభమైందని, అందులో భాగంగా నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్‌లో కూడా ముందస్తు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తా మన్నారు. అపోలో హాస్పిటల్స్‌లో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అన్ని రకాల క్యాన్సర్లకు వైద్య చికిత్సను అందిస్తున్నామని చెప్పారు. క్యాన్సర్ వ్యాధుల పట్ల అవగాహన కలిగించడం, స్క్రీనింగ్ పరీక్షలను ప్రోత్సహించడం, సరైన చికిత్స అందించి మహిళా లోకానికి అండగా నిలవడమే అపోలో ఆసుపత్రుల లక్ష్యమని ఆయన తెలిపారు.

## రెడ్‌బుక్ రాజ్యాంగంతో...

# రాష్ట్రంలో ఎమర్జెన్సీ పరిస్థితులు



- నెల్లూరు పర్యటనలో జగన్ విమర్శ
- కాకాణి, ప్రసన్నలకు పరామర్శ

రెడ్‌బుక్ రాజ్యాంగంతో రాష్ట్రంలో ఎమర్జెన్సీ పరిస్థితులు కనిపిస్తున్నాయని వైకాపా అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు. జులై 31 గురువారం నాడు ఆయన నెల్లూరుకు వచ్చి, జైలులో ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో ములాఖత్ అయ్యారు. అనంతరం, మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లా డుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలంటూ ప్రజలను మోసం చేశా రని, తన హయాంలో ఉన్న నాడు–నేడు, ఇంగ్లీష్ మీడియం, విద్యార్థులకు ఇస్తున్న పథకాలు అన్నిటినీ ఆపేశారని, వ్యవస్థలన్ని టినీ నిర్వీర్యం చేశారని విమర్శించారు.

తమ పార్టీవారు తనను చూసేందుకు వస్తుంటే, వారిని.. తన అభిమానులం దరినీ తనను చూడకుండా చేసేందుకు రోడ్లను కూడా తవ్వించేశారని, ప్రతిపక్ష నేతను చూసి చంద్రబాబు భయపడిపో తున్నారన్నారు. కాకాణిపై అక్రమ కేసులు పెట్టారని, ప్రసన్న ఇంటిపై దాడులు చేయించారని, టీడీపీ నాయకులు చేతుల్లో గాయపడిన బాధితులను పరామర్శించినా కేసులు పెడుతున్నారని, ఇదెక్కడి న్యాయ మని ప్రశ్నించారు. తన పర్యటనలో అభిమానులు కలవకుండా అడుగడుగునా అడ్డుకున్నారని ఆరోపించారు. చంద్రబాబు ప్రభుత్వం ఎల్లకాలం ఉండదని, తమ ప్రభుత్వం వచ్చినప్పుడు ఇప్పుడు చంద్ర బాబు అడుగులకు మడుగులొత్తుతున్న అధికారుల లెక్కతేల్చి చట్టం ముందు నిలబెడతామని హెచ్చరించారు. కాగా, జగన్‌ని చూసేందుకు పెద్దసంఖ్యలో అభిమానులు, వైకాపా కార్యకర్తలు, నాయకులు తరలివచ్చారు.

పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలుచోట్ల పోలీసులకు, వైకాపా కార్యకర్తలకు మధ్య తోపులాటలు కూడా జరిగాయి. స్థానిక నాయకులు, కార్యకర్తలు జగన్ వెంట ఈ పర్యటనలో పాల్గొన్నారు.

# మొక్కుబడిగా 'కౌన్సిల్' సమావేశం

### పెద్దగా చర్చలేమీ లేకుండానే.. 132 అంశాలకు ఆమోదం



***నెల్లూరు మునిసిపల్ కౌన్సిల్ సమావేశమంటే ఒక మొక్కుబడి ప్రహసనంగా తయారైంది. పెద్దగా చర్చలేమీ లేకుండానే, ఎన్ని అంశాలనైనా ఏకగ్రీవంగా ఆమోదింపజేసుకోవడం, అజెండా చర్చించకుండానే అన్నిటికీ ఒకే చెప్పేయడంతో బుధవారం జరిగిన కౌన్సిల్ సమావేశం నామమాత్రమైంది. కేవలం పది నిమిషాల్లోనే అజెండాలోని అధికశాతం అంశాలను ఆమోదించేసుకున్నారు.***

జులై 30న జరిగిన నెల్లూరు మునిసి పల్ కార్పొరేషన్ సమావేశంలో అనేక అంశాలకు నిమిషాల వ్యవధిలోనే ఆమోద ముద్ర పడింది. పెద్దగా చర్చలేమీ లేకుం డానే ఆమోదం తెలుపుతుండడంతో, జరిగిపోయిన పనులను ఆమోదించుకు నేందుకు సమావేశం ఏర్పాటుచేసినట్లుగా ఉందనే విమర్శలూ వినవచ్చాయి. నగర మేయర్ పొట్లూరి స్రవంతి అధ్యక్షతన కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ రూప్ కుమార్‌యాదవ్ మాట్లాడుతూ, అజెండా మొత్తం ముందస్తు అనుమతులతోనే ఉం దని, నూరుశాతం ర్యాటిఫికేషన్ సరైనది కాదని వ్యాఖ్యానించారు. ఒకవైపు కార్ప రేషన్ ఆర్థిక పరిస్థితి బాగాలేదంటూనే మరోవైపు పండుగలు పబ్బాలకు కోట్లు ఖర్చుచేయడాన్ని పునరాలోచించుకోవాలని సూచించారు. పలువురు కార్పొరేటర్లు స్థానిక సమస్యలను ఈ మావేశంలో ప్రస్తా వించారు. నగరంలోని ఎన్ని అక్రమ కట్ట డాలను గుర్తించారు?...ఎన్నిటికి జరిమా నాలు విధించారని కార్పొరేటర్ కిన్నెర మాల్యాద్రి ప్రశ్నించారు. 111 అంశాల్లో ఒక్కటైనా కౌన్సిల్ ఆమోదంతో చేశారా అని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో వికాస్ మర్మత్ కమిషనర్‌గా ఉన్న సమయంలో, కార్పొరేషన్ పట్టణ ప్రణా ళికా విభాగంలో ఫోర్జరీ సంతకాలతో కోట్లాది రూపాయలను కొల్లగొట్టారని, దానిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలని ఆయన సమావేశంలో ప్రశ్నలు సంధించారు. అసలు సమావేశం తీరే బాగాలేదంటూ కార్పొరేటర్ కర్తం ప్రతాప్ రెడ్డి బాయ్‌కాట్ చేసి వెళ్ళిపోయారు. మేయర్ స్రవంతి మాట్లాడుతూ, ఈ సమా వేశంలో మొత్తం 132 అంశాలను సభ్యు లంతా ఆమోదించినట్లు తెలిపారు. నగ రంలో సీసీ డ్రెయిన్లు, రోడ్ల నిర్మాణాలకి 10.36 కోట్లతో పనులకు ఆమోదం తెలిపినట్లు చెప్పారు. మొత్తంగా 43.72 కోట్ల పనులను ఆమోదించినట్లు తెలిపారు. డిప్యూటీ మేయర్ తహసీన్, కమిషనర్ వైఓ నందన్, కోఆప్షన్ సభ్యులు నరసింహా రావు, మల్లికార్జునయాదవ్ పాల్గొన్నారు.

## క్షయ బాధితులకు వెంటనే చికిత్స చేయాలి

- జిల్లా క్షయ నివారణాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ

టీబీ(క్షయ వ్యాధి) నిర్ధారణ పరీక్షలు చేసిన సమయంలో ఎవరికైనా ఆ వ్యాధి ఉన్నట్లు తెలిస్తే.. వెంటనే వారికి చికిత్స ప్రారంభించాలని ఆరోగ్య కేంద్రాల వైద్యాధి కారులకు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నివారణాధికారి డాక్టర్ ఎస్.కె.ఖాదర్‌వలీ సూచించారు. జులై 30న ఆయన నెల్లూరులోని వేదాయపాళెం, పడారుపల్లి, ఆర్టీసీ డిస్పెన్సరీ అర్బన్ ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. వ్యాధుల నిర్ధారణ, చికిత్సల పట్ల వైద్యారోగ్య సిబ్బంది ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా బాధితులకు తగు వైద్యసేవలందించాలని ఆయన చెప్పారు. వైద్యాధికారులు శ్రావణ్‌కుమార్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## జాబ్‌మేళా ఏర్పాట్లను..
# పరిశీలించిన మంత్రి ఆనం



ఆత్మకూరులో కనీవినీ ఎరుగని విధంగా పెద్దఎత్తున నిరుద్యోగులకు మెగా జాబ్‌మేళా ఏర్పాటుచేస్తున్నారు. రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చొరవతో ఆత్మకూరులోని ఆంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో ఈ జాబ్‌మేళా ఏర్పాటవుతోంది. ఆ సందర్భంగా ఆయన జులై 28న ఆర్డీఓ పావనితో కలిసి జాబ్‌మేళా ఏర్పాట్లను పరిశీలించి, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామీణ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాల కల్పనే ధ్యేయంగా ఆగస్టు1, 2 తేదీల్లో, రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో, మంత్రి నారా లోకేష్ సూచనల మేరకు జాబ్ మేళా నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఇప్పటికే సుమారు 70 కంపెనీల ప్రతినిధులు యువతకు ఉద్యోగాలు ఇచ్చేందుకు ముందుకొచ్చారన్నారు. యువతకు జాబ్ మేళాలోనే వారి అర్హతల మేరకు ఉద్యోగ నియామక ఉత్తర్వులు అందజేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆత్మకూరు ఆర్డీఓ నోడల్ అధికారిగా, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి కన్వీనర్‌గా జాబ్ మేళాకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నామని, సచివాలయాల సిబ్బంది, మండలస్థాయి అధికారులు అందరూ సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలోని యువ నాయకులందరూ వలంటీర్లుగా జాబ్ మేళా విజయవంతానికి ముందుకొస్తున్నారని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ప్రత్యేకించి మెట్టప్రాంతాలైన ఆత్మకూరు, ఉదయగిరి, కావలి, బద్వేల్, వెంకటగిరి నియోజకవర్గ నిరుద్యోగ యువత అందరూ ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

# గత చరిత్ర స్మృతులే.. హరిహర వీరమల్లు!

## ఎమ్మెల్యే కాకర్ల



గత చరిత్ర స్మృతులే హరిహర వీరమల్లు చిత్రమని, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆ సినిమాలో అద్భుతంగా నటించారని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కొనియాడారు. జులై 28న ఆయన వింజమూరులోని థియేటర్లో, జనసేన నియోజకవర్గం కోఆర్డినేటర్ కొట్టే వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో, తమతో పాటు నియోజకవర్గంలోని ఆడపడుచుల కోసం హరిహర వీరమల్లు సినిమా ఉచిత షోను ప్రదర్శించారని, ఈ సినిమాకి నియోజకవర్గంలోని మహిళలు పెద్ద ఎత్తున వచ్చి సినిమాను చూడడం తమకెంతో ఆనందం కలిగించిందన్నారు. కోహినూరు వజ్రం గురించి ఈ సినిమాలో అద్వితీయంగా తెలియజేశారన్నారు.

# 3,4 తేదీల్లో..సీపీఐ మహాసభలు



సీపీఐ (భారత కమ్యూనిస్టు పార్టీ) నెల్లూరుజిల్లా శాఖ మహాసభలు ఆగస్టు 3, 4 తేదీల్లో నెల్లూరులో పెద్దఎత్తున జరుగనున్నాయి. తమ పార్టీ ఏర్పడి వందేళ్ళు పూర్తయిన సందర్భంగా జులై 27న నెల్లూరు రూరల్ మండలంలోని సౌత్‌మోపూరులో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య మాట్లాడుతూ, సీపీఐ ఆధ్వర్యంలో జరిగిన అనేక ప్రజాఉద్యమాలు, భూపోరాటాలను వివరించారు. అనంతరం మండల సీపీఐ కార్యదర్శిగా కొప్పోలు అంకయ్యను, సహాయ కార్యదర్శిగా వై.ఆదినారాయణను, మరో 15 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. సీపీఐ సీనియర్ నాయకుడు పముజుల దశరథరామయ్య, చేనేత కార్మిక సంఘం నాయకుడు పముజుల హరి, నాయకులు వి.రామరాజు, సిరాజ్, లీలామోహన్, రమణయ్య, మాలకొండయ్య, నరసయ్య, శ్రీరాములు పాల్గొన్నారు. అనంతరం పలువురు సీనియర్ నాయకులు పార్టీకి చేసిన సేవలను కొనియాడుతూ, వారిని సన్మానించారు.

# పద్యంతో తెలుగుకు మరింత వెలుగు



పద్యంతో తెలుగు భాషకు మరింత వెలుగు వచ్చిందని ప్రముఖ సాహితీవేత్త చేగొండి వీరవెంకట సత్యనారాయణమూర్తి చెప్పారు. చెన్నైలోని వేద విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రతినెలా నిర్వహిస్తున్న తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహికలో భాగంగా, ఇటీవల 'తెలుగు పద్య వైభవం' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. పద్యగాన కళలో అత్యంత ప్రతిభావంతులైన చేగొండి సత్యనారాయణమూర్తి ప్రముఖ సినీ కవి అనంత్ శ్రీరామ్ తండ్రి కూడా. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా ఎంతో గౌరవమున్న మధురమైన భాష మన తెలుగుభాష అని కొనియాడారు. అనంతరం భారతంలోని మహాకవి తిక్కన పద్యాలను, నృసింహపురాణంలోని ఎర్రన పద్యాలను, శ్రీనాధుని పద్యాలను ఆయన హృద్యంగా ఆలపించారు. తొలుత, నెల్లుట్ల శ్రీనివాసులు రచించిన 'తలపుల పుంత' సప్తపదుల కవితాసంపుటిని వేద విజ్ఞాన వేదిక అధ్యక్షుడు జేకేరెడ్డి ఆవిష్కరించారు. ప్రముఖ సినీ నిర్మాత కాట్రగడ్డ ప్రసాద్ తొలిప్రతిని స్వీకరించారు. సంస్థ కార్యదర్శి కందనూరు మధు తదితరులు పాల్గొన్నారు.

## తలుపూరుపాడు పోలేరమ్మకి చందనాలంకారం

సంగం మండలం తలుపూరుపాడులో ఉన్న పోలేరమ్మ దేవాలయం వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా జులై29న అమ్మవారికి చందనాలంకారం నిర్వహించి, ప్రత్యేకపూజలు చేశారు. అమ్మవారి మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు ఈ పూజల్లో పాల్గొన్నారు.

## ముసునూరువారిపాలెంలో లేగదూడల ప్రదర్శన

జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జులై29న ముత్తుకూరు మండలంలోని ముసునూరువారిపాలెం పశువైద్యశాలలో ఏ.డి డా.డి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. ఆరోగ్యంగా ఉన్న దూడలను పరిశీలించి, వాటి యజమానులకు బహుమతులిచ్చారు.

## టూకీగా...



### సోమశిల డ్యామ్‌కి పెరిగిన వరదనీరు

ఎగువప్రాంతాల్లో వర్షాల వల్ల అనంతసాగరం మండలంలోని సోమశిల జలాశయానికి వరదనీటి ప్రవాహం పెరిగింది. జులై 29న 12,213 క్యూసెక్కుల వరదనీరు జలాశయానికి చేరింది. డ్యామ్‌లో ప్రస్తుతం 31.250 టీఎంసీల నీటి నిల్వ ఉంది. దీంతో, ఉత్తర కాలువకు 320, దక్షిణ కాలువకు 400, డెల్టాకు 3200 క్యూసెక్కుల వంతున నీరు విడుదల చేస్తున్నారు.

### కావలిలో డ్రైనేజీ పనుల పరిశీలన

కావలి పట్టణంలో జరుగుతున్న డ్రైనేజీ పనులను జులై 29న కావలి మునిసిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ పరిశీలించారు. స్థానికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా డ్రైనేజీ పనులు చేపట్టాలని ఈ సందర్భంగా ఇంజనీరింగ్ అధికారులకు, సిబ్బందికి సూచించారు.

### మనుబోలులో వాహనాల తనిఖీ

మనుబోలు జాతీయ రహదారిపై పలు ప్రాంతాల్లో పోలీసులు జులై 29న వాహనాలను తనిఖీ చేశారు. ఎస్ఐ శివరాకేష్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనదారుల వద్దనున్న వాహనపత్రాలను పరిశీలించారు. సరైన పత్రాలు లేని వాహనదారులకు జరిమానాలు వేశారు. అతి వేగం వద్దని, హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనాలు నడపకూడదని ఈ సందర్భంగా హెచ్చరించారు.

### కోవూరులో ఉచిత హోమియో వైద్యశిబిరం

కోవూరులో జులై 29న స్థానికంగా ఉన్న ఓ కల్యాణ మండపంలో హోమియో వైద్యుడు కరుణాకం హోమియో వైద్యశిబిరాన్ని ఏర్పాటుచేశారు. రిటైర్డ్ ఉద్యోగులకు ఉచితంగా హోమియో మందులు పంపిణీ చేశారు. ఏపీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్-కోవూరు యూనిట్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కార్యదర్శి రమణారెడ్డి, కోశాధికారి వెంకయ్య పాల్గొన్నారు.

### జగదేవిపేటలో 'పొలం పిలుస్తోంది'

ఇందుకూరుపేట మండలం జగదేవిపేటలో జులై 29న వ్యవసాయాధికారి రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించి, రైతులకు ఈ-పంట నమోదుపై అవగాహన కలిగించారు. ప్రభుత్వ పథకాలను అందుకోవాలంటే రైతులు తమ పంటల వివరాలను నమోదు చేసుకోవడం తప్పనిసరి అని చెప్పారు. పంటల సాగులో మెళకువలు పాటించాలన్నారు.

### అమ్మవారిపాలెంలో పేదవిద్యార్థులకు నోటుపుస్తకాలు

పొదలకూరు మండలంలోని అమ్మవారిపాలెం గ్రామం ప్రాథమిక పాఠశాలలో చదువుకుంటున్న పేదవిద్యార్థులకు 'అమ్మ మహిళా సమాజ్'వారు ఇటీవల పలకలు, నోటు పుస్తకాలు, పెన్‌లు అందజేశారు. ఎంఇఓ రేణుక ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆ సంస్థ ప్రెసిడెంట్ కె.ఉమ, విద్యాకమిటీ ఛైర్మన్ సురేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.




కీ॥శే॥ మాగుంట రాఘవరెడ్డి గారు

శ్రద్ధాంజలి

మా ఇంటి ఆశాజ్యోతి, నిరంతరం మా హృదయాంతరాల్లో వెలిగే ధృవతార
మా అభివృద్ధికి కారకులు, అనురాగంతో మమ్మల్ని
తన గుండెలలో దాచుకున్న ప్రేమమయుడు
మా తండ్రి కీ॥శే॥ మాగుంట రాఘవరెడ్డి గారు.
01-08-2025 శుక్రవారం ఆ మహనీయుని 48వ వర్ధంతి సందర్భంగా
వారి పవిత్రాత్మకు మా శ్రద్ధాంజలి.

కుమారుడు
మాగుంట శ్రీనివాసులురెడ్డి
ఎం.పి, ఒంగోలు.

మనుమళ్ళు
మాగుంట కిరణ్‌రెడ్డి
మాగుంట రాఘవ్‌రెడ్డి
మాగుంట నిఖిల్‌రెడ్డి

మునిమనవడు
మాగుంట సుబ్బరామ్‌రెడ్డి

# నేల నుండి నింగికి..
# నిసార్ ఉపగ్రహం

(మొదటిపేజీ తరువాయి)




## ○ జిఎస్ఎల్వి-ఎఫ్16 సక్సెస్

అగ్రదేశాలకు ధీటుగా మనదేశం చేపడుతున్న అంతరిక్ష ప్రయోగాల్లో వరుస విజయాలను అందుకుంటున్న భారత అంతరిక్ష పరిశోధన సంస్థ, తన 102వ ప్రయోగాన్ని విజయవంతంగా జరిపి తన సత్తా చాటుకుంది. అమెరికా-భారత్ కలసి చేపట్టిన జీఎస్ఎల్వీ-ఎఫ్ 16 రాకెట్ జులై 30వ తేదీ బుధవారం సాయంత్రం నేల నుంచి నింగిలోకి దూసుకుపోయి, నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకుంది. శాస్త్రవేత్తలంతా ఉత్కంఠతో రాకెట్ గమనాన్ని వీక్షిస్తుండగా, ప్రయోగించిన 19 నిమిషాల్లోపలే రాకెట్ శాస్త్రవేత్తలు నిర్దేశించిన కక్ష్యలోకి చేరి, అందరి కరతాళధ్వనులందుకుంది. శ్రీహరి కోటలోని షార్‌లో ఉన్న రెండవ ప్రయోగ వేదికపై నుంచి ఈ రాకెట్ 2,392 కేజీల బరువున్న నిసార్ ఉపగ్రహాన్ని అవలీలగా మోసుకుపోయి కక్ష్యలోకి చేర్చింది. ఒక్కో దశను అధిగమిస్తూ, భూమికి 745 కిలో మీటర్ల ఎత్తులో ఉన్న సూర్య సమకాలిక కక్ష్యలో ఆ ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టింది. దీంతో షార్‌లో ఆనందోత్సాహాలు వెల్లువెత్తాయి. ఇస్రో ఛైర్మన్ డా.నారాయణన్‌తో పాటు శాస్త్రవేత్తలు సంబరాలు చేసుకున్నారు. ఇస్రో-నాసా తొలిసారిగా నిసార్ ఉపగ్రహాన్ని సంయుక్తంగా రూపొందించారు. సుమారు 13,155 కోట్ల రూపాయల వ్యయంతో ఈ ఉపగ్రహ ప్రయోగాన్ని చేపట్టారు. ఈ ఉపగ్రహ ప్రయోగాన్ని పరిశీలించేందుకు అమెరికాకి చెందిన నాసా శాస్త్రవేత్తలు కూడా షార్‌కు వచ్చారు.

### అత్యంత నైపుణ్యం కలిగిన.. భూ పరిశీలనా ఉపగ్రహం :

నిసార్ ఉపగ్రహం ఎంతో ప్రయోజనకరమైనది. ఇది ప్రత్యేకించి భూ పరిశీలనా ఉపగ్రహం కావడం విశేషం. భూమి ఉపరితలాన్ని నిశితంగా పరిశీలించేందుకు ఇదెంతో ఉపయోగపడుతుంది. అయిదేళ్ల పాటు ఇది పనిచేసేలా రూపొందించారు. భూమిని అత్యంత దగ్గరగా పరిశీలించడం, దీనిలో ఉన్న అధిక రిజల్యూషన్ డేటా ద్వారా దేశంలోని తీరప్రాంతాలను పర్యవేక్షించేలా ఏర్పాట్లు చేశారు. ప్రతి పన్నెండురోజుల కోసారి ఈ ఉపగ్రహం నింగినుంచి భూమిని స్కాన్ చేస్తుంది. ఆ సమయంలో భూమిపై పరిస్థితి ఎలా ఉన్నా సరే, ఒకే సామర్థ్యంతో భూమిని స్కాన్ చేసే అత్యంత నైపుణ్యం ఈ ఉపగ్రహానికి ఉంటుంది. దీని ద్వారా, డెల్టాప్రాంతాల్లో భౌగోళిక మార్పులను అధ్యయనం చేస్తారు. ఎప్పటికప్పుడు వాతావరణ మార్పులు పరిశీలించేందుకు, సముద్రంపై మంచు కదలికలను కూడా కనిపెట్టేందుకు ఇదెంతో ఉపయోగపడుతుంది. ఇది ఏ ఒకటి రెండు దేశాలకో కాదు, ఈ ఉపప్రగహం పంపే డేటా (సమాచారం) మొత్తంగా ప్రపంచానికంతటికీ ప్రయోజనకరంగా ఉంటుంది. ముఖ్యంగా, పర్యావరణ వ్యవస్థలు, జీవ వైవిధ్యం, వృక్షసంపద, భూగర్భ జలాలు, సముద్రమట్టం పెరుగుదలతో సహా భూకంపాలు, సునామీ, అగ్నిపర్వతాల విస్ఫోటనాలు, కొండచరియలు విరిగిపడడాలు వంటి ప్రకృతి విపత్తులను కూడా గుర్తించేందుకు వీలుగా ఈ ఉపగ్రహంలో శక్తివంతమైన పరికరాలను అమర్చారు. భవిష్యత్ ప్రయోగాలకు కూడా ఈ ప్రయోగం ఎంతగానో తోడ్పడుతుందని ఇస్రో ఛైర్మన్ నారాయణన్ తెలిపారు.

## ఏపీలో 'జాతీయ బయో ఎనర్జీ' అమలుపై
# లోక్‌సభలో విపిఆర్ ప్రశ్నలు



ఆంధప్రదేశ్ రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ బయో ఎనర్జీ ప్రోగ్రామ్ కింద అందించిన సహాయాన్ని తెలియజేయాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి బుధవారం లోక్‌సభలో కోరారు. ఆ మేరకు జాతీయ ఆ కార్యక్రమానికి సంబంధించిన వివరాలు తెలపాలని అడిగారు. ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాల వారీగా ఏర్పాటు చేస్తున్న బయోఎనర్జీ ప్రాజెక్టుల వివరాలు, ఫేజ్-1 కింద బయోఎనర్జీ ప్రాజెక్టులు ఏ విభాగాల కింద ఏర్పాటు చేయబడ్డాయి, ఫేజ్-1 ఈ ఆర్థిక సంవత్సంలో పూర్తవుతున్న నేపథ్యంలో ఫేజ్-2 కోసం చేస్తున్న సన్నాహాల వివరాలు, ప్రాజెక్టులను స్థాపించడానికి ఆంధ్రప్రదేశ్‌కు అందించిన ఆర్థిక, ఇతర సహాయం వివరాలు తెలియజెప్పాలన్నారు. అందుకు, కేంద్ర పునరుత్పాదక ఇంధనం, విద్యుత్ శాఖ సహాయ మంత్రి శ్రీపాద యశోనాయక్ లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. ప్రతిష్టాత్మక పునరుత్పాదక ఇంధన లక్ష్యాలను సాధించడానికి, ఇంధన రంగంలో స్వావలంబన తెచ్చేందుకు జాతీయ బయోఎనర్జీ ప్రోగ్రామ్ (ఎన్‌బీపీ)ని నూతన మరియు పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ అమలు చేస్తోందన్నారు. దీని ద్వారా బయోగ్యాస్, కంప్రెస్డ్ బయోగ్యాస్, పట్టణ, పారిశ్రామిక, వ్యవసాయ వ్యర్థాలు, అవశేషాల నుండి విద్యుత్ ఉత్పత్తి కోసం వ్యర్థాల నుండి ఎనర్జీ ప్రాజెక్టుల ఏర్పాటుకు మద్దతు ఇవ్వడం, బయోమాస్ బ్రికెట్, పెల్లెట్ తయారీ ప్లాంట్ల ఏర్పాటు, బయోమాస్ ఆధారిత కోజెనరేషన్ ప్రాజెక్టుల ఏర్పాటు, శుభ్రమైన వంట ఇంధనం కోసం చిన్న, మధ్య తరహా బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటు వంటివి చేపడుతున్నట్లు వివరించారు.

## ఎగుమతి ప్రోత్సాహక మిషన్‌పై
# రాజ్యసభలో బీఎంఆర్ ప్రశ్నలు



దేశంలోని ఎగుమతుల స్థితిగతులు మరియు ఎగుమతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేమిటని రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు (బీఎంఆర్) జులై 25న రాజ్యసభలో కేంద్ర వాణిజ్య మరియు పరిశ్రమలశాఖ మంత్రిని ప్రశ్నించారు. అందుకు, కేంద్ర సహాయ మంత్రి జితిన్ ప్రసాదా మాట్లాడుతూ 2024-25 సంవత్సరంలో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారెన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) 'ట్రేడ్ ఫైనాన్స్ ఇన్ ఇండియా' అనే అధ్యయనాన్ని చేపట్టిందని, ఈ అధ్యయనంలో ఎగుమతి ఫైనాన్స్ సమస్యలు మరియు వాటి పరిష్కార మార్గాలను గుర్తించిందని తెలిపారు. అంతే కాకుండా వివిధ ఎగుమతి ప్రోత్సాహక మండలులు (ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్స్) కూడా ఈ-కామర్స్ ఎగుమతులపై విశ్లేషణలు జరిపినట్టు తెలిపారు. ఎగుమతి ప్రోత్సాహక మిషన్ రూపకల్పనలో భాగంగా, కమోడిటీల జాబితా లేదా ఖచ్చితమైన లక్ష్యాలను ఇప్పటివరకు నిర్ణయించలేదని, కానీ ఈ అంశాలు తుది నిర్ణయానికి వచ్చేవరకు అనేక మంత్రిత్వ శాఖల మధ్య చర్చలు జరుగుతున్నాయని స్పష్టం చేశారు. ఎగుమతి ప్రోత్సాహక మిషన్‌పై దేశవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు, మిషన్ అధికారిక ఆమోదానంతరం చేపట్టనున్నట్టు మంత్రి వెల్లడించారు. అనంతరం బీఎంఆర్ మాట్లాడుతూ, ఎగుమతుల ప్రోత్సాహానికి కేంద్రం తీసుకుంటున్న ప్రయత్నాలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. అన్ని రంగాలలో ఎగుమతుల వృద్ధికి పారదర్శక విధానాలు అవసరమని, దీనికి ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యంతో పటిష్ట వ్యవస్థలు రూపొందించాలని ఆయన అభిప్రాయపడ్డారు.

# శ్రీసిటీలో.. ఆస్ట్రేలియా కాన్సుల్ జనరల్

## 'ఆక్స్ ఎయిర్' పరిశ్రమతో అవగాహనా ఒప్పందం




ఆస్ట్రేలియా కాన్సుల్ జనరల్ శ్రీమతి సిలై జాకి, తమ అధికారుల బృందంతో కలిసి ఇటీవల శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ (మార్కెటింగ్) ఆర్.శివశంకర్ వారికి స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతలపై సమగ్ర వివరాలు తెలిపారు. అనంతరం, కాన్సుల్ జనరల్‌తో చర్చల సందర్భంగా పారిశ్రామిక అభివృద్ధి గురించి శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి వివరించారు. శ్రీసిటీలో 31 దేశాలకు చెందిన 240కి పైగా పరిశ్రమలు స్థాపించడం జరిగిందని, విభిన్న రంగాలలో పెట్టుబడి అవకాశాల కోసం అన్వేషిస్తున్న కంపెనీలకు శ్రీసిటీ అత్యంత విలువైన పెట్టుబడి గమ్య స్థానంగా మారిందని వివరించారు. శ్రీసిటీలోని వెంచర్ ఆటోమోటివ్ ఇండియా పరిశ్రమ (ఆస్ట్రేలియా ఉమ్మడి భాగస్వామ్య కంపెనీ) ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రపంచశ్రేణి మెట్రోరైళ్లను తయారు చేసే శ్రీసిటీలోని ఆల్‌స్టామ్ కంపెనీ, మొట్ట మొదటి పూర్తిస్థాయి ఆటోమేటెడ్ మెట్రో రైళ్లను సిడ్నీ మెట్రోకు సరఫరా చేయడం భారతదేశం-ఆస్ట్రేలియా పారిశ్రామిక సహకారంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా అభివర్ణించారు. ఆ బృందం శ్రీసిటీకి రావడం ఆస్ట్రేలియాకు చెందిన మరిన్ని పెట్టుబడులు శ్రీసిటీకి రావడానికి మార్గం సుగమం చేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. శ్రీసిటీ వ్యాపారానుకూల వాతావరణం పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన కాన్సుల్ జనరల్, భారత దేశంలో తాను పర్యటించిన అత్యుత్తమ వ్యాపార కేంద్రాల్లో శ్రీసిటీ ఒకటిగా ప్రశంసించారు. ప్రపంచ తయారీ అవసరాలకు ధీటుగా ఉత్తమ ప్రణాళిక, ఆవిష్కరణ, వ్యాపార అవకాశాలు కలిగిన పారిశ్రామిక కేంద్రం శ్రీసిటీగా ట్రేడ్ మరియు ఇన్వెస్ట్‌మెంట్ కమిషనర్ నాథన్ అభిప్రాయపడ్డారు. ఈ పర్యటనలో కీలకాంశంగా, కాన్సుల్ జనరల్ సమక్షంలో శ్రీసిటీలో పరిశ్రమ ఏర్పాటుకు ఆస్ట్రేలియాకు చెందిన ఇంజనీరింగ్ సంస్థ ఆక్స్ ఎయిర్ ప్రెజర్ వెసెల్స్ మాన్యుఫ్యాక్చరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ మరియు శ్రీసిటీ అవగాహనా ఒప్పందం కుదుర్చుకున్నాయి. పారిశ్రామిక అవసరాలకు ఉపయోగపడే వివిధ గ్యాస్‌లను నిల్వచేసే అధిక పీడన ట్యాంకులను ఈ కంపెనీ తయారు చేస్తుంది. కాన్సుల్ జనరల్ శ్రీసిటీ పరిసరాలను వీక్షించడంతో పాటు వెంచర్ పరిశ్రమను సందర్శించి ఉత్పత్తుల తీరును పరిశీలించారు.

## 'వికసిత్ భారత్' పథకంపై అవగాహనా సదస్సు




ప్రధానమంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన (పీఎం వీబీఆర్‌వై) పథకంపై ఇటీవల శ్రీసిటీలో అవగాహనా సదస్సు జరిగింది. యువతకు ఉపాధి లక్ష్యంగా ఎంప్లాయ్‌మెంట్ లింక్డ్ ఇన్సెంటివ్ ప్రోగ్రామ్ అని కూడా పిలిచే ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, దీనిపట్ల అవగాహన పెంచడం, సమర్థవంతంగా అమలు చేసేలా ప్రోత్సహించడం ఈ సదస్సు ముఖ్య ఉద్దేశ్యమని వక్తలు తెలిపారు. ఈ పథకం క్రింద లభించే వివిధ ప్రయోజనాలను. తయారీ రంగ యాజమాన్యాల కోసం రూపొందించిన ప్రత్యేక నిబంధనలను కూడా వివరించారు. శ్రీసిటీ వైస్‌ప్రెసిడెంట్(కస్టమర్ రిలేషన్స్) సి.రమేష్ కుమార్, శ్రీసిటీ హెచ్‌ఆర్ ప్రతినిధి వి.శివ కుమార్ పర్యవేక్షించారు.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com